



విలేకరుల సమావేశంలో వెంకటశివుడు యాదవ్, ఎమ్మెల్యే శ్రావణిశ్రీ

జగన్ వల్లే రాష్ట్రం అప్పుల కుప్ప

టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్

అనంతపురం, జనవరి 29(ఆంధ్రజ్యోతి): రాష్ట్రాన్ని అప్పులకుప్పగా మార్చింది జగన్ జమానాలోనే కదా అని టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్ ఎద్దేవా చేశారు. ప్రజా సంక్షేమం, రాష్ట్రాభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుపై విమర్శలు చేస్తే ప్రజలెవరూ నమ్మే పరిస్థితిలో లేరన్న విషయాన్ని వైసీపీ జిల్లా అధ్యక్షుడు అనంత గ్రహిస్తే మంచిదని హితవు పలికారు. టీడీపీ జిల్లా కార్యాలయంలో శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీతో కలిసి ఆయన మీడియాతో బుధవారం మాట్లాడారు. ఒక్క చాన్స్ పేరుతో అధికారంలోకి వచ్చిన జగన్ రాష్ట్రాన్ని కోలుకోలేని విధంగా అప్పుల్లోకి నెట్టారని విమర్శించారు. ఐదేళ్ల పాలనలో రూ. 10 లక్షల కోట్లకుపైగా అప్పులు చేసింది వాస్తవం కాదా అని నిలదీశారు. జగన్ చేసిన అప్పుల భారాన్ని తగ్గిస్తూనే... రాష్ట్రాభివృద్ధిపై చంద్రబాబు దృష్టి సారించారన్నారు. గడిచిన ఏడు నెలల కాలంలో ఆరోగ్యశ్రీ, ధాన్యం బకాయిలు, ఫీజు రీయింబర్స్‌మెంట్, ఇతరత్ర బకాయిలకు చంద్రబాబు రూ. 22 వేల కోట్లు చెల్లించారని గుర్తు చేశారు. ఈ వాస్తవాలను మరిచి అనంత వెంకటరామిరెడ్డి కూటమి ప్రభుత్వం, ముఖ్యమంత్రి చంద్రబాబుపై విమర్శలు చేయడం దయ్యాలు వేదాలు వల్లించినట్లుగా ఉందన్నారు.

వైసీపీది దోపిడీ పాలన: బండారు శ్రావణి

రాష్ట్రంలో వైసీపీది మొత్తం దోపిడీ పాలనగా ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ అభివర్ణించారు. విజనరీ లీడర్ చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధి వైపు వెళుతోందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దావోస్ పర్యటనతో పెద్ద ఎత్తున రాష్ట్రానికి పరిశ్రమలు వస్తున్నాయన్నారు. గత ప్రభుత్వంలో వైసీపీ పాలకులు పెట్టే ఇబ్బందులతో పారిశ్రామిక వేత్తలు పారిపోయారన్నారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో జగన్ రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చారన్నారు. ఇప్పుడేమో డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం ఓవైపు జగన్ పాలనలో చేసిన అప్పులను చెల్లిస్తూనే... మరోవైపు అభివృద్ధి కార్యక్రమాలు చేస్తోందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఎన్నికలకు ముందు ఏ హామీలైతే ఇచ్చారో వాటిని ఒక్కొక్కటిగా అమలు చేస్తూ ముందుకు పోతున్నారన్నారు.



ముళ్ల పొదలను తొలగించడంతో శుభ్రంగా మారిన ఖాళీ స్థలాలు





డ్రైనేజీలో పూడిక తీత

అక్షరంతో పరిష్కారం



- ఆదర్శ నగర్‌లో పారిశుధ్య కల్పన
- మిగిలిన కాలనీల్లో నేటి నుంచి...
- ఎమ్మెల్యే దగ్గుపాటి, ఇన్‌చార్జి కమిషనర్ చొరవ
- హర్షం వ్యక్తం చేస్తున్న 32వ డివిజన్ ప్రజలు

అనంతపురం క్రైం, జనవరి 29(ఆంధ్రజ్యోతి): ప్రజల సమస్యల పరిష్కారం కోసం ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ చేపట్టిన 'అక్షరం అండగా.. పరిష్కారమే అజెండాగా' కార్యక్రమం సత్ఫలితాలను ఇస్తోంది. అనంతపురం 32వ డివిజన్ ఆదర్శనగర్‌లో మంగళవారం నిర్వహించిన ఈ కార్యక్రమానికి వందలాది మంది ప్రజలు వచ్చి ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్, ఇన్‌చార్జి కమిషనర్ మల్లికార్జున రెడ్డికి సమస్యలను చెప్పుకున్నారు. ఖాళీ స్థలాల్లో ముళ్ల పొదలు పెరిగాయని, విష పురుగులు ఇళ్లలోకి వస్తున్నాయని కొందరు ఫిర్యాదు చేశారు. పరిష్కారానికి హామీ ఇచ్చిన ఎమ్మెల్యే.. కార్పొరేషన్ సిబ్బందిని రంగంలోకి దించారు. ఎంహెచ్‌ఓ విష్ణుమూర్తి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ వెంకటేష్ రెండు ఎక్స్‌కవేటర్లను బుధవారం ఆదర్శ నగర్‌కు తీసుకువెళ్లి ఖాళీ స్థలాల్లో ముళ్లపొదలను తొలగించి, శుభ్రం చేయించారు. డ్రైనేజీ కాలువల్లో పూడికను తొలగించారు. ఇదే డివిజన్‌లోని ఓబుళదేవ్‌నగర్, విద్యుత్‌నగర్, సెవెన్ హిల్స్ కాలనీ, ఎఫ్‌సీఐ కాలనీల్లో గురువారం నుంచి పారిశుధ్య పనులు చేపడతామని ఎంహెచ్‌ఓ తెలిపారు. ఆంధ్రజ్యోతి చొరవతో సమస్యలు పరిష్కారమౌతున్నాయని స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

సచివాలయాలకు సమస్యల జాబితా

'అక్షరం అండగా... పరిష్కారమే అజెండాగా' కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులు, వినతుల జాబితాను ఇన్‌చార్జి కమిషనర్ సచివాలయాలకు పంపారు. వాటిని త్వరగా పరిష్కరించాలని ఆదేశించారు. ఎప్పటికప్పుడు తనకు నివేదిక ఇవ్వాలని సూచించారు.

ప్రభుత్వం స్థలంలో వెలసిన గుడిసెలు



పొలాల్లో ఉబుకుతున్న చెరువు నీరు



ఎవరిది బాధ్యత..?

చెరువు, వంకలను ఆక్రమిస్తున్న అక్రమార్కులు

- పామురాయి చెరువు పక్కన వెలసిన గుడిసెలు
- ఉప్పరపల్లి పరిస్థితి ఇక్కడ ఎదురైతే..?
- మేలుకోని రెవెన్యూ అధికారులు

అనంతపురం రూరల్, జనవరి 29(ఆంధ్రజ్యోతి): భూ అక్రమార్కులు పేట్రేగిపోతున్నా రు. ఖాళీ జాగా కనిపిస్తేలు చాలు..ఆక్రమించేస్తున్నారు. వంకలు, చెరువులను సైతం మింగేస్తున్నారు. తొలుత గుడిసెలు వేస్తారు. తర్వాత వాటికి నకిలీ పట్టాలు సృష్టించి, మాయమాటలతో పేదలకు అమ్మి సొమ్ము చేసుకుంటున్నారు. ఈవ్యవహారం అనంతపురం రూరల్ మండలంలో విచ్చల విడిగా సాగుతోంది. తాజాగా మండలంలోని పామురాయి చెరువు పక్కన ప్రభుత్వం స్థలం ఆక్రమణకు గురైంది. సోములదొడ్డి, పామురాయి మధ్య పాము రాయి చెరువు ఉంది. చెరువు పక్కనే సోములదొడ్డి గ్రామ సర్వే నెంబరు 124లో ప్రభుత్వం భూమి రెండు ఎకరాల వరకు ఉంది. ఆ భూమిని కొంతమంది ఆక్రమించి గుడిసెలు వేశారు. అయితే ఈ విషయాన్ని రెవెన్యూ అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదు.

జరగరానిది జరిగితే..

ప్రస్తుతం పామురాయి చెరువు నిండుగా నీరు ఉంది. దీంతో ఆనుకుని ఉన్న భూముల్లో జొకులు పారుతున్నాయి. వర్షాలు మొదలైతే పరిస్థితి మరింత దారుణంగా ఉంటుంది. నాలుగు నెలల కిందట మండలంలోని ఉప్పరపల్లి సమీపంలో వర్షాలకు గుడిసెలు మొత్తం నీటి మునిగిన విషయం తెలిసిందే. పామురాయి వద్ద వెలసిన గుడిసెలదీ ఇదే పరిస్థితి. గుడిసెలు వేసిన ప్రాంతం చెరువుగట్టుకు ఆనుకుని ఉంది. జరగరాని జరిగితే గుడిసెలు మొత్తం మునిగిపోయే ప్రమాదం ఉంది. ఇప్పటికే చెరుకు దిగువన ఉన్న పంటపొలాల్లో నీటి ఊట కనిపిస్తోంది. హైదారాబాదు-బెంగళూరు హైవేకు ఆనుకుని ఉన్న నారాయణ కళాశాల పక్క పొలాల్లోను ఇదే విధంగా ఉంది. వర్షాలు కురిస్తే ఆక్రమణదారులు వేసుకున్న గుడిసెలు గల్లతయ్యే పరిస్థితి ఉంది.



చెరువుకట్టకు ఆనుకుని ఉన్న గుడిసెలు

మేలుకోని రెవెన్యూ అధికారులు

అనంతపురం రూరల్ మండలం నగరానికి అత్యంత సమీపంలో ఉండటంతో ఆక్రమణదారులు ఇష్టారాజ్యంగా వంకలు, చెరువులను ఆక్రమిస్తున్నారు. ఆ భూములుల్లో గుడిసెలు, ఇల్లు నిర్మిస్తున్నారు. ఈ విషయం రెవెన్యూ అధికారులకు తెలీయందికాదు. అయినా వారిలో ఏమాత్రం చలనం లేదు. ఇంతలో గుడిసెలు వేయించిన వ్యక్తులు పేదలతో అందిన కాటికి సొమ్మును దండుకుని పబ్బం గడుపుకుంటున్నారు. మొదట్లోనే ఆక్రమణదారులను నియంత్రిస్తే..పేదలకు మేలు జరిగే అవకాశం ఉంటుంది. ఇలా కాకుండా పేదలు నిండా మునిగిపోయేంత వరకు రెవెన్యూ అధికారులు అటూ వైపు చూడటం లేదు. ఉప్పరపల్లి చుట్టుపక్కల పండమేరు వంకకు వేసుకున్న గుడిసెల పరిస్థితి ఇదే విధంగా ఉండింది. పాముురాయిలో ఈపరిస్థితి తలెత్తకుండా సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది.

పోలీస్ ప్రొటెక్షన్ కోసం..

పాముురాయి చెరువు పక్కన ప్రభుత్వ భూమి ఆక్రమించి గుడిసెలు వేసుకున్న విషయం మా దృష్టికి వచ్చింది. ఎన్నికల సమయంలో గుడిసెలు వేశారు. వాటి తొలగింపునకు అప్పటి తహసీల్దార్ నోటీసులు కూడా ఇచ్చారు. అయితే చర్యలు తీసుకోలేదు. ఈక్రమంలోనే స్థానికంగా ఉన్న కొంత మంది మరో సర్వేలోని పట్టాలతో స్థానికంగా ఉన్నామంటూ కోర్టును ఆశ్రయించారు. గుడిసెలు వేసుకున్న స్థలానికి, కేసుకు సంబంధంలేదని కోర్టుకు నివేదించాం. గుడిసెల తొలగింపునకు పోలీసు ప్రొటెక్షన్ కోరాం. దాని కోసమే ఎదురుచూస్తున్నాం.



- మోహన్‌కుమార్,
తహసీల్దార్, అనంతపురం
రూరల్ మండలం

మనల్నెవరు మామా అడిగేదీ..!

తాడిపత్రి పట్టణ నడిబొడ్డున.. పోలీస్ స్టేషన్ ఎదురుగా బుధవారం మధ్యాహ్నం 2గంటల సమయంలో ఇద్దరు ఇలా డివైడర్‌పై సిట్టింగ్ వేశారు. బాగా మందేసి.. కాసేపు గొడవపడ్డారు. ఆ తరువాత మరో బాటిల్ మద్యం తెచ్చుకుని 'చీర్స్' చెప్పుకుని ఖాళీ చేశారు. ఇది కొత్తేమీ కాదని.. డివైడర్‌పై సిట్టింగ్.. వచ్చిపోయే వారితో ఫైటింగ్ మామూలే అని స్థానికులు అంటున్నారు. స్టేషన్ ఎదుటే ఈ తంతు సాగుతున్నా పోలీసులు పట్టించుకోవడం లేదు. ఊరి బయట.. నిర్జన ప్రదేశాల్లో డ్రోన్ నిఘా వేసి మద్యం తాగేవారిని పరిగెత్తించే పోలీసులు.. పట్టణ నడిబొడ్డున.. అదీ స్టేషన్ ఎదుట సిట్టింగ్ వేసినా పట్టించుకోకపోవడం గమనార్హం.

- ఆంధ్రజ్యోతి, తాడిపత్రి





ఇంటర్ పరీక్షలపై సమీక్ష

అనంతపురం టౌన్, జనవరి 29(ఆంధ్రజ్యోతి): ఇంటర్ పబ్లిక్, ప్రాక్టికల్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో పరీక్షల నిర్వహణపై బుధవారం సమీక్ష నిర్వహించారు. మార్చి ఒకటో తేదీ నుంచి థియరీ, ఫిబ్రవరి 5 నుంచి ఒకేషనల్ ప్రాక్టికల్స్, ఫిబ్రవరి 10 నుంచి జనరల్ ప్రాక్టికల్స్ ఉంటాయని తెలిపారు. విద్యార్థులకు ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. విద్యుత్, బస్సులు తాగునీరు, గాలి, వెలుతురు, ఫర్నిచర్ ఉండేలా చూడాలని అన్నారు. ప్రతి పరీక్ష కేంద్రంలో వైద్య సిబ్బంది అందుబాటులో ఉండాలని అన్నారు. అధికారులు సమన్వయంతో పనిచేయాలని అన్నారు. డీఆర్వో మలోల, ఆర్డీఓ కేశవనాయుడు, ఆర్ఐఓ వెంకటరమణ నాయక్, డీఈఓ ప్రసాద్‌బాబు, కాలేజీల ప్రిన్సిపాల్స్ పాల్గొన్నారు.

రాచరికం.. సీమ నేపథ్యం

చిత్ర నిర్మాత ఈశ్వర్ చాణక్య

అనంతపురం కల్చరల్, జనవరి 29(ఆంధ్రజ్యోతి): రాచరికం సినిమాను రాయలసీమ చరిత్ర నేపథ్యంగా నిర్మించామని చిత్ర నిర్మాత ఈశ్వర్ చాణక్య తెలిపారు. సినిమా ప్రచారం కోసం హీరోలు విజయ్ శంకర్, వరుణ్ సందేశ్, హీరోయిన్ అప్సరా రాణి తదితరులతో కలిసి బుధవారం ఆయన అనంతపురం వచ్చారు. అనంతపురానికి చెందిన తాను ఈ ప్రాంతవాసులను ప్రోత్సహించాలని భావించి, టెక్నీషియన్లుగా 70 శాతం మందిని అనంతపురం జిల్లా నుంచే తీసుకున్నానని తెలిపారు. జిల్లాలోని మరింత మంది కళాకారులను వెలుగులోకి తెచ్చేందుకు ప్రయత్నిస్తానని అన్నారు. ఈ నెల 31న విడుదల కానున్న రాచరికం సినిమాలో రాయలసీమ ఫ్యాక్షనిజం, రాజకీయాలను చూపించామని అన్నారు. చాలా సినిమాల్లో అనంతపురం అంటే ఫ్యాక్షనిజం అని మాత్రమే చూపారని, కానీ ఇక్కడ ప్రేమకూ కొరత లేదని తమ చిత్రం నిరూపిస్తుందని హీరో విజయ్ శంకర్ అన్నారు. వరణ్ సందేశ్‌లో మరో కోణాన్ని ఈ సినిమాలో చూడవచ్చునని అన్నారు. అనంతపురంలో పర్యటించాలని ముందు నుంచి తనకు ఆశగా ఉండేదని, ఈ సినిమా ద్వారా ఆశ నెరవేరిందని హీరోయిన్ అప్సరారాణి అన్నారు. కార్యక్రమంలో దర్శకుడు సురేష్ లంకలపల్లి, చాణక్య, విజయ్ పాల్గొన్నారు.



విలేకరులతో రాచరికం చిత్రబృందం

గాలికొదిలేశారు..!

- ఒక్క రికార్డు నమోదు చేయని హాస్టల్ వార్డెన్లు
- హాజరు నమోదులో అవకతవకలు
- పర్యవేక్షణాధికారి వద్ద కానరాని రికార్డులు

మెమో జారీ... కలెక్టర్ చెంతకు ఫైలు

అనంతపురం ప్రెస్‌క్లబ్, జనవరి 29(ఆంధ్రజ్యోతి): ఉరవకొండ డివిజన్‌లోని ఎస్సీ వెల్ఫేర్ వార్డెన్లు హాస్టల్ నిర్వహణను గాలికొదిలేశారు. విద్యార్థుల భద్రత, హాస్టల్‌లో ఉండాల్సిన 18 రకాల రికార్డులను పత్తాలేకుండా చేశారు. కనీసం విద్యార్థుల అటెండెన్స్ రిజిస్టర్‌ను సైతం ఆరు నెలలుగా నమోదు చేయలేదంటే ఆయా వార్డెన్లకు విధుల పట్ల ఉన్న చిత్తశుద్ధి అర్థం చేసుకోవచ్చు. తాజాగా మంగళవారం కొందరు అధికారులు ఉరవకొండలోని డివిజన్‌లో తనిఖీలకు వెళ్లిన సమయంలో ఈ సంఘటనలు వెలుగు చూశాయి. ఉరవకొండ డివిజన్‌లోని రాకెట్ల ఎస్సీ బాలుర వసతిగృహంలో 108 విద్యార్థులు ఉండగా మంగళవారం ఉదయం బయోమెట్రిక్ ద్వారా హాజరుశాతం 100 మంది ఉండగా... హాస్టల్‌లో 42 మంది విద్యార్థులు ఉన్నారు. ఇదేమని సంబంధిత వార్డెన్‌ను ప్రశ్నిస్తే సమాధానం లేదు. మూమెంట్ రిజిస్టర్, హాజరు పట్టిక, స్టాక్ రిజిస్టర్ తదితర వాటిని అడగ్గా ఒక్కటంటే ఒక్క రికార్డు కూడా చూపనట్లు తెలిసింది. ఉరవకొండ నెం-2 బాయ్స్ హాస్టల్‌లో 68 మంది ఉండగా... బయోమెట్రిక్‌లో 68 మంది హాజరు వేయగా 51 మంది విద్యార్థులు ఉన్నట్లు తెలిసింది. ఇక్కడ కూడా రికార్డులు అస్తవ్యస్తంగా ఉండగా... మూడునెలలకుపైగా రికార్డులు నమోదు చేయకపోవడాన్ని గుర్తించారు. ఉరవకొండలోని నెం-1 బాలికల వసతిగృహంలో అధికారులు పర్యవేక్షించిన సమయంలో ఒక్కరంటే ఒక్కరు కూడా విద్యార్థినులు లేకపోవడంతో అధికారులు అవాక్కైనట్లు తెలిసింది. అదే సమయంలో వార్డెన్ సైతం తన విధుల సమయం కన్నా ముందే హాస్టల్ నుంచి వెళ్లిపోయినట్లు తెలిసింది. తరువాత ఇదేమని సంబంధిత వార్డెన్‌ను అడిగితే పొంతనలేని సమాధానాలు చెప్పినట్లు సమాచారం. దీంతో ఆ డివిజన్ పర్యవేక్షణాధికారిని రికార్డులు కోరగా తన వద్ద లేవన్నారు. దీంతో అధికారులు సీరియస్ అయి ఆయనకు మెమో జారీ చేశారు. ఈ తతంగంపై ఆ శాఖ ఉన్నతాధికారులు ఫైలు సిద్ధం చేసి కలెక్టర్ చెంతకు చేర్చినట్లు సమాచారం. కలెక్టర్ ఆదేశాలతో ఆ అధికారులపై వేటుపడే అవకాశం ఉంది.



మాట నిలుపుకున్న సీఎం చంద్రబాబు

నేమకల్లు ఆలయ అభివృద్ధికి రూ.3.7 కోట్లు మంజూరు

బొమ్మనహాళ్, జనవరి 29(ఆంధ్రజ్యోతి): నేమకల్లు ఆంజనేయ స్వామి సాక్షిగా ప్రజల సమక్షంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఇచ్చిన హామీల్లో ఒక్కోటి నెరవేర్చుతున్నారని ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు తెలియజేశారు. ఈ మేరకు రాయదుర్గంలో బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. పింఛన్ల పంపిణీ సందర్భంగా నేమకల్లు గ్రామానికి వచ్చినపుడు నేమకల్లు ఆంజనేయస్వామి ఆలయ అభివృద్ధికి ఇచ్చిన హామీ మేరకు రూ. 3.7 కోట్లు మంజూరు చేస్తూ పాలనా అనుమతులు జారీ చేయటం పట్ల చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ మేరకు దేవదాయశాఖకు తాజా ఉత్తర్వులు వెలువడ్డాయని పేర్కొన్నారు. ఆలయ ప్రాకారం, గోపురం, ఇతరత్ర అభివృద్ధి పనులు చేపడతామన్నారు. త్వరితగతిన పనులు ప్రారంభించేలా చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. రూ.మూడు కోట్లతో గ్రామంలో సీసీరోడ్లు, మురుగు కాలువల ఏర్పాటు జరుగుతోందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబుతోనే రాష్ట్రం, ముఖ్యంగా రాయదుర్గం ప్రాంతం అభివృద్ధి చెందుతున్నారు.

ఎంతైనా రైతు బిడ్డ కదా..!

పొలం పనుల్లో మాజీ మంత్రి రఘువీరారెడ్డి బిజీబిజీ



పొలంలో వ్యవసాయ పనులు చేస్తున్న రఘువీరారెడ్డి

మడకశిర రూరల్, జనవరి 29(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో వ్యవసాయశాఖ మంత్రిగా పనిచేసిన రఘువీరారెడ్డి స్వగ్రామం నీలకంఠాపురంలో వ్యవసాయ పనుల్లో బిజీబిజీగా గడుపుతున్నారు. గ్రామ సమీపంలో ఉన్న సొంత పొలంలోకి వెళ్లి అక్కడ వ్యవసాయపనులు చేసి మధ్యాహ్నం అక్కడే పొలం వద్ద ఉన్న రచ్చబండపైనే కూర్చొని భోజనం తింటున్నారు. 50 ఏళ్ల కిందట రఘువీరారెడ్డి తండ్రి కావేరప్ప కూడా పొలం పనులు చేసిన అనంతరం అదే రచ్చబండపై కూర్చుని రాగిముద్ద తినేవారని స్థానికులు చెబుతున్నారు. అదేబాటలో రఘువీరారెడ్డి నడుస్తున్నారని వారు పేర్కొన్నారు.

సబ్సిడీ రుణాలకు దరఖాస్తు చేసుకోండి

అనంతపురం ప్రెస్‌క్లబ్, జనవరి 29(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం బీసీ కార్పొరేషన్ ద్వారా విడుదల చేస్తున్న సబ్సిడీ రుణాలకు సంబంధించి గురువారం నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు బీసీ కార్పొరేషన్ ఈడీ సుబ్రహ్మణ్యం తెలిపారు. ఈ మేరకు బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఈనెల 30 నుంచి ఫిబ్రవరి ఏడో తేదీ వరకూ దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం ఉందన్నారు. అర్హులైన ఆయా కేటగిరీల లబ్ధిదారులు తమ ఆధార్, రేషన్ కార్డులు, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలతో ఓబీఎంఎంఎస్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

నేడు జడ్పీ సర్వసభ్య సమావేశం

అనంతపురం విద్య, జనవరి 29(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లా సర్వసభ్యసమావేశం గురువారం నిర్వహించనున్నారు. జడ్పీలోని సమావేశ మందిరంలో ఉదయం 10.30 గంటలకు నిర్వహించనున్నారు. ప్రతి సమావేశానికి అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల నుంచి అన్నిశాఖల అధికారులు హాజరుకావాల్సి ఉంది. కొన్ని సర్వసభ్యసమావేశాలకు శ్రీసత్యసాయి జిల్లా కలెక్టర్ కానీ, పలుశాఖల అధికారులు కానీ పూర్తిస్థాయిలో హాజరుకావడం లేదు. దీంతో జడ్పీటీసీలతోపాటు, ఎమ్మెల్యేలు సైతం అసహనం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా అనంతపురం జిల్లాకు చెందిన అధికారులు, కలెక్టర్ ఇతర శాఖల అధికారులు వస్తున్నారు కానీ శ్రీ సత్యసాయి జిల్లా నుంచి అధికశాతం డుమ్మా కొడుతున్నారు. దీంతో సభ్యులు అడిగిన ప్రశ్నలకు జవాబు ఇచ్చే అధికారుల కోసం ఎదురు చూడాల్సి వస్తోంది. గతంలో అనేక సమావేశాల్లో ఇదే సీన్లు కనిపించాయి. దీంతో గతంలో జరిగిన సమావేశంలో జడ్పీ ఛైర్‌పర్సన్, పలువురు ఎమ్మెల్యేలు సైతం అసహనం వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. మరి ఈ సమావేశానికైనా వస్తారో.. రారో..?

దరఖాస్తుల ఆహ్వానం

అనంతపురం ప్రెస్‌క్లబ్, జనవరి29(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో ఉన్న మాజీ సైనికులు టోల్‌ప్లాజాలో ఖాళీగా ఉన్న సెక్యూరిటీ గార్డు ఉద్యోగాలకు దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా సైనిక సంక్షేమశాఖాధికారి తిమ్మప్ప తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. తాడిపత్రి వద్ద ఉన్న జోడి ధర్మావరం టోల్‌ప్లాజాలో సెక్యూరిటీ గార్డు ఉద్యోగాలు ఖాళీలు ఉన్నాయన్నారు. ఉమ్మడి జిల్లాలో ఉండి, ఆసక్తి గల మాజీ సైనికులు తమ బయోడేటాతో కర్నూలులోని కృష్ణజ్యోత్స్న కాంప్లెక్స్‌లో ఉన్న కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలన్నారు. వివరాలకు ఫోన్ : 08554-241146కు సంప్రదించాలన్నారు.

విద్యార్థులకు అండగా వైసీపీ

పార్టీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి



మాట్లాడుతున్న అనంత వెంకటరామిరెడ్డి

అనంతపురం క్రైం, జనవరి 29(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం విద్యార్థుల ఫీజులు చెల్లించడం లేదని, వారికి వైసీపీ అండగా నిలుస్తుందని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. వైసీపీ జిల్లా కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వానికి హెచ్చరికగా ఫిబ్రవరి 5న అనంతపురం నగరంలో 'ఫీజు పోరు' కార్యక్రమం చేపడుతున్నట్లు స్పష్టం చేశారు. ఏ ప్రభుత్వాలు మారినా కొన్ని పథకాలకు సంబంధించి బకాయిలుంటాయన్నారు. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు విద్యారంగానికి సంబంధించి గత ఏడాది మార్చిలోనే రూ.708 కోట్లు విడుదల చేశామని, కానీ అదే సమయంలోనే ఎన్నికల కోడ్ రావడంతో చెల్లింపులు ప్రక్రియ నిలిచిపోయిందన్నారు. కూటమి పార్టీలు అధికారంలోకి వచ్చాక చెల్లింపులు ఆగిపోయాయ న్నారు. ఇప్పటికే చాలా చోట్ల ఫీజుల కోసం కళాశాలల యాజమాన్యాలు ఒత్తిడి చేస్తున్నట్లు తెలిపారు. ఫీజు చెల్లిస్తేనే పరీక్షలకు కూర్చోబెడతామంటున్నారని, ఇప్పటికే ఉత్తీర్ణత సాధించి ఉన్నత చదువులు, ఉద్యోగాలకు ఎంపికైన వారు సర్టిఫికెట్ల కోసం కళాశాలల చుట్టూ ప్రదక్షిణ చేస్తున్నారన్నారు. 11 సీట్లే వచ్చినా బలమైన ప్రతిపక్షంగా ప్రజల తరపున పోరాటం చేస్తామన్నారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు ప్రకాష్‌రెడ్డి, ఆలమూరు శ్రీనివాసరెడ్డి, నాగన్న, రమేష్ గౌడ్, శ్రీదేవి, సాకే చంద్రశేఖర్, అమర్నాథ్‌రెడ్డి, ఓబిరెడ్డి, సైఫుల్లా బేగ్, నరసింహులు, చంద్రశేఖర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీమంతుడికి.. సిరి కరువు..!

- లక్ష్మీ చెన్నకేశవస్వామి భూములు అన్యాక్రాంతం
- స్వామి సేవల పేరుతో సొంత పేర్లపై పట్టా బుక్కులు
- ఆలయ మాన్యాన్ని అమ్మేసిన మరికొందరు
- ఉత్సవాలకు అవసరమైన సొమ్ము కోసం ఇబ్బందులు
- నిర్లక్ష్యం మత్తువీడని దేవదాయశాఖ అధికారులు



యాడికిలోని లక్ష్మీ చెన్నకేశవస్వామి ఆలయం

"శ్రీమంతుడైన శ్రీవారు కొందరు అక్రమార్కుల వల్ల నిరుపేదగా మారాడు. వందల ఎకరాల మాన్యం ఉన్నా నిత్య కైంకర్యాలు, ఉత్సవాలకు దాతల వద్ద చేయి చాచాల్సిన దుస్థితి. ఆలయానికి సంబంధించి భూములు, షాపింగ్ కాంప్లెక్స్ నుంచి వచ్చే ఆదాయం ఎమవుతుందో తెలియని పరిస్థితి. ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధుల పర్యవేక్షణ లేకపోవడంతోనే ఇలా జరుగుతోందని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇదీ ప్రసిద్ధిగాంచిన యాడికి శ్రీలక్ష్మీ చెన్నకేశవ స్వామి ఆలయానికి సంబంధించిన కథాకమామిషు ..."

యాడికి, జనవరి 29(ఆంధ్రజ్యోతి): ప్రఖ్యాతిగాంచిన యాడికి శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామి ఆలయ భూములు అన్యాక్రాంతమయ్యాయి. దీంతో స్వామివారి కైంకర్యాలకు దాతలపై ఆధారపడాల్సిన దుస్థితి నెలకొంది. శ్రీకృష్ణదేవరాయల కాలం నిర్మించిన ఈ పురాతన ఆలయానికి రికార్డుల ప్రకారం 250 ఎకరాలు ఉంది. గతంలోనే కొంత భూమిని వేలం ద్వారా విక్రయించగా చివరకు 152.78 ఎకరాలు మిగిలింది. ఈ భూమిని సైతం కొందరు స్వామిసేవల పేరు చెప్పి తమ సొంత పేర్లతో పట్టాదారు పాసు బుక్కులు చేసుకున్నారు. మరికొందరు ఏకంగా అమ్మేశారు. ఇంత జరుగుతున్నా దేవదాయశాఖ అధికారులు చర్యలకు పూనుకోకపోవడంతో ఆలయ భూములు తరిగిపోయి స్వామి నిరుపేదగా మారే అవకాశం ఉంది. 2016లో అప్పటి దేవదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ గాయత్రీదేవి అన్యాక్రాంతమైన చెన్నకేశవస్వామి ఆలయ భూములను పరిశీలించారు. రికార్డులు ఎవరిపేరుతో ఉన్నాయని దేవదాయ, రెవెన్యూశాఖ అధికారులను ఆరాతీశారు. సేవల పేరుతో సాగు చేసుకుంటున్న వారిపేరుతోనే భూములు ఉన్నాయని తెలపడంతో ఆమె తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. దేవదాయశాఖ అ ధికారులు చెన్నకేశవస్వామి ఆలయ భూముల పరిరక్షణ దిశగా చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.



స్వామివారి మూలవిరాట్

ఎకరా రూ.50లక్షల నుంచి రూ.కోటి వరకు

అన్యాక్రాంతం అయిన చెన్నకేశవస్వామి ఆలయ భూముల విలువ ప్రస్తుత మార్కెట్‌లో ఎకరా రూ.50లక్షల నుంచి కోటి రూపాయల వరకు పలుకుతోంది. స్థానిక కమలపాడురోడ్డు, బుగ్గరోడ్డులో ఉన్న స్వామివారి మాన్యం భూముల ధరకు రెక్కలొచ్చాయి. ఐదేళ్ల కిందట రియల్ ఎస్టేట్ వ్యాపారులు, మధ్యవర్తులు రంగ ప్రవేశం చేసి ఆలయ భూములను ఎడా పెడా క్రయ, విక్రయాలు చేసి చేతులు మార్చేశారు. ఆలయ భూముల పరిరక్షణ కోసం 2018లో అప్పటి ఎమ్మెల్యే జేసీ ప్రభాకర్ రెడ్డి ఆలయ ప్రాంగణంలో స్థానికులతో సమావేశం నిర్వహించారు. దీంతో ఆలయ భూములు క్రయ, విక్రయాలు చేసుకున్న వారిలో గుబులు పుట్టుకుంది. ఆ తర్వాత ఎన్నికలు రావడంతో ఆలయ భూముల సమస్య మరుగునపడింది. ఇటీవల కాలంలో యాడికి వచ్చిన దేవదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ ఆదిశేషునాయుడు దృష్టికి స్థానికులు ఆలయ భూముల అన్యాక్రాంతం విషయం తీసుకెళ్లారు. ఆలయ భూముల వివరాలు, స్వామివారి ఆస్తులను వెల్లడించాలని స్థానికులు కోరారు. దీనిపై ఆయన మాట్లాడుతూ ఆలయ ఈఓ మాకు సహకరించడం లేదని తెలపడం గమనార్హం.



యాడికిలో అన్యాక్రాంతమైన ఆలయ భూమి

కుంటలో ఆక్రమణలు లెక్కలేనన్ని

నాటి చెన్నకేశవస్వామి ఆలయ కోనేరు నేడు కుంటగా పిలుస్తున్నారు. అపరిశుభ్రంగా ఉన్న కుంటను 2017-2018లో నాటి ఎమ్మెల్యే జేసీ ప్రభాకర్ రెడ్డి పూడ్చివేయించి స్థానికుల ఉపాధి కోసం వాణిజ్య దుకాణాలు ఏర్పాటు చేయించారు. వంద కుటుంబాలకు పైగా ఈ స్థలంలో బంకులు ఏర్పాటు చేసుకొని జీవనోపాధి పొందుతున్నారు. గ్రామానికి నడిబొడ్డున కుంట స్థలం ఉండటంతో చుట్టుపక్కల ఉన్నవారు కుంట స్థలాన్ని ఆక్రమించి నిర్మాణాలు చేపట్టారు. తరచూ ఆక్రమణలు జరుగుతున్నా దేవదాయశాఖ అధికారులు గానీ, పంచాయతీ అధికారులు గానీ ఎటువంటి చర్యలు చేపట్టకపోవడం గమనార్హం.

దాతల చందాలతో బ్రహ్మోత్సవాల నిర్వహణ

ప్రతి ఏడాది మార్చినెలలో శ్రీలక్ష్మిచెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలను 10రోజులపాటు వైభవంగా నిర్వహిస్తారు. వందల ఎకరాల భూమి ఉన్నప్పటికి స్వామివారి ఉత్సవాల నిర్వహణకు దాతలు ఇచ్చే చందాలపై ఆధారపడాల్సి వస్తోంది. స్వామి భూములు అనుభవిస్తున్న వారి నుంచి ఎంత కౌలు వసూలు చేస్తున్నారు. ఆలయానికి సంబంధించి నిర్మించిన గదుల నుంచి ఎంత అద్దె వసూలు చేస్తున్నారు వాటిని దేనికి వినియోగిస్తున్నారు వంటి వివరాలు ఏవీ దేవదాయశాఖ అధికారుల వద్ద లేకపోవడం గమనార్హం. అధికారికంగా ఆలయ కమిటీ ఉంటే ఆలయ అభివృద్ధిపై ఏదైనా చేయడం సాధ్యమవుతుందని స్థానికులు కోరుతున్నారు. దేవదాయశాఖ అధికారులు ప్రకటించకపోయినా కొందరు తామే ఆలయ కమిటీగా గత ఐదేళ్ల నుంచి ఉత్సవాలు నిర్వహించారు. ప్రస్తుత దేవదాయశాఖ అధికారులు చొరవచూపి ఆలయ కమిటీని ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు. ఆలయ కమిటీ ఏర్పాటుచేస్తే బ్రహ్మోత్సవాల నిర్వహణకు ఎటువంటి ఆటంకాలు ఉండవని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.



అన్యాక్రాంతంపై వివరాలు ఆరాతీస్తున్న అసిస్టెంట్ కమిషనర్ గాయత్రీదేవి(ఫైల్)

నివేదికను తయారుచేశాం

- ఆదిశేషునాయుడు, అసిస్టెంట్ కమిషనర్, దేవదాయశాఖ

ఆలయ భూముల వివరాలు, ఆస్తుల వివరాలు ఇవ్వాలని ఆలయ ఈఓకు చాలాసార్లు తెలియజేశాం. ఆయన నిర్లక్ష్యం వహిస్తున్నారు. నేను యాడికి గ్రామానికి వచ్చిన సమయంలో స్థానికులు కొన్ని సమస్యలను నా దృష్టికి తీసుకువచ్చారు. అన్నింటిపైనా నివేదికను తయారుచేస్తున్నాం. ఈ నివేదికను దేవదాయశాఖ కమిషనర్‌కు అందజేస్తాం. ఆలయ భూముల పరిరక్షణ దిశగా చర్యలు చేపడతాం.

ఉద్యోగం పేరుతో రూ.23 లక్షలకు బురిడీ

- మోసపోయిన ఉరవకొండ మహిళ

ఉరవకొండ, జనవరి 29(ఆంధ్రజ్యోతి): ఉద్యోగంపై ఆశతో ఉరవకొండకు చెందిన ఓ మహిళ రూ.23లక్షలు మోసపోయింది. లబోదిబోమంటూ పట్టణ పోలీసులను ఆశ్రయించింది. సంఘటనకు సంబంధించి సీఐ మహానంది తెలిపిన మేరకు... ఉరవకొండలోని ఇందిరా నగర్‌కు చెందిన విజయలక్ష్మి అనే మహిళ ఏడో తరగతి వరకూ చదువుకుంది. ఫారెవర్ మార్కెంటింగ్ గ్రూప్ ఉత్పత్తుల వివరాలను ఫేస్‌బుక్‌లో షేర్ చేస్తే కమీషన్ వస్తుందన్న విషయాన్ని చూసింది. వెంటనే ఓ వ్యక్తి ఇలాంటివి నమ్మి మోసపోవద్దని, కావాలంటే తాను బ్యాంకులో టెలికాలర్ ఉద్యోగం ఇప్పిస్తానని, అందుకు రూ.5లక్షలు లంచం ఇవ్వాలని ఆమెకు చెప్పాడు. గత ఏడాది ఆమె రూ.4లక్షలు దాకా అతడి అకౌంట్‌కు జమ చేసింది. తర్వాత ఆమెకు అనుమానం వచ్చి డబ్బు వెనక్కు ఇవ్వాలని ఒత్తిడి చేసింది. ఆమెను నమ్మించడానికి దుండగుడు ఆర్టీజీఎస్ ద్వారా ఆమె ఖాతాలోకి రూ.లక్ష పంపాడు. దీంతో అతడిని పూర్తిగా నమ్మి, సుమారుగా రూ.23లక్షలు దాకా అతడి ఖాతాలోకి జమ చేసింది. రెండు రోజుల తర్వాత అతడి ఫోన్ స్విచ్ ఆఫ్ రావడంతో పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆమె ఫిర్యాదు మేరకు హైదరాబాదుకు చెందిన అక్షయ్‌నందన్ మీద కేసు నమోదు చేశారు.


బాధలతో బలవన్మరణాలు

- ఉమ్మడి జిల్లాలో ఐదుగురి ఆత్మహత్య
- ఒంటరితనాన్ని భరించలేక ఇద్దరు..
- అప్పుల బాధతో రైతు.. మరొకరు..
- కుటుంబ కలహాలతో రెవెన్యూ ఉద్యోగి..

(న్యూస్ నెట్‌వర్క్ ఆంధ్రజ్యోతి)

అప్పులు, అనారోగ్యం, కుటుంబ సమస్యలతో ఉమ్మడి జిల్లాలో ఐదుగురు ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఒంటరితనంతో ఇద్దరు, సేద్యం గిట్టుబాటుకాక ఒకరు, అప్పులు చేసి తీర్చలేక మరొకరు, రెండో భార్యతో గొడవల కారణంగా రెవెన్యూ ఉద్యోగి బలవన్మరణాలను ఎంచుకున్నారు. ఈ ఘటనలతో బాధిత కుటుంబాలు, బంధుమిత్రుల్లో విషాదం నెలకొంది.

అప్పుల బాధతో ఇద్దరు..



రామాంజనేయులు మృతదేహం


- ఉరవకొండ మండలం ఆమిద్యాలకు చెందిన రైతు రామాంజనేయులు(39) అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్నాడు. రామాంజనేయులుకు రెండున్నర ఎకరాల పొలం ఉంది. వ్యవసాయం చేసుకుంటూనే, ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. సేద్యం, కుటుంబ అవసరాల కోసం రూ.3 లక్షలకుపైగా అప్పు చేశాడు. వాటిని తీర్చేమార్గం లేక బుధవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకున్నాడు. కుటుంబ సభ్యులు ఉరవకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. రైతుకు భార్య శ్రీలత, ఇద్దరు కుమారులు ఉన్నారు.



శంకర్ (ఫైల్)

- బత్తలపల్లి మండలం సూర్యచంద్రపురంలోని బంధువుల ఇంటికి వచ్చిన శంకర్(37) అనే వ్యక్తి ఉరి వేసుకున్నాడు. ధర్మవరం పట్టణంలోని సత్యసాయి నగర్‌కి చెందిన చెందిన శంకర్, తనకు ఆరోగ్యం బాగాలేదని, కాసేపు నిద్రపోతానని బంధువులకు చెప్పి.. గదిలోకి వెళ్లాడు. ఎంతసేపటికీ తలుపులు తీయక పోవడంతో అనుమానం వచ్చి పిలిచారు. స్పందన లేకపోవడంతో తలుపులను బద్దలుకొట్టి చూశారు. అప్పటికే ఫ్యానుకు ఉరి వేసుకుని చనిపోయాడు. మృతుడికి భార్య జ్యోతి, ఇద్దరు కుమారులు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. అప్పుల బాధతోనే బలవన్మరణానికి పాల్పడినట్లు తెలిసింది.

ఒంటరితనం భరించలేక ఇద్దరు..



నోయల్ ల్యాంబ్ మృతదేహం

- గుంతకల్లు పట్టణంలోని గంట చర్చి రోడ్డు ప్రాంతానికి చెందిన నోయల్ ల్యాంబ్(35) ఉరివేసుకున్నాడు. నోయల్ రైల్వేలో ఉద్యోగం చేసేవాడు. కొన్నేళ్ల నుంచి విధులకు వెళ్లక పోవడంతో రైల్వే అధికారులు ఉద్యోగం నుంచి తొలగించారు. 2016లో పెళ్లి చేసుకున్నాడు. ఏడాదికే భార్య విడాకాలు తీసుకుంది. దీంతో అతను మద్యానికి బానిసయ్యాడు. ఇతడి కుటుంబ సభ్యులు హైదరాబాదులో ఉంటున్నారు. ఇంట్లో ఒక్కడే ఉండేవాడు. ఈ క్రమంలో ఆరోగ్యం క్షీణించడం, ఒంటరితనాన్ని భరించలేక మంగళవారం రాత్రి ఇంటి పైకప్పునకు ఉరి వేసుకున్నాడు. వన్‌టౌన్ పోలీసులు బుధవారం ఆ ఇంటికి వెళ్లి పరిశీలించారు. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.
- కళ్యాణదుర్గం భట్టువాని వీధిలో రాజేష్ (38) అనే వ్యక్తి ఉరి వేసుకున్నాడు. రాజేష్ తల్లిదండ్రులు కొన్నేళ్ల కిందట చనిపోయారు. సోదరి లక్ష్మి ఉద్యోగం చేస్తూ హైదరాబాద్‌లో స్థిరపడ్డారు. స్థానికంగా ఒంటరిగా ఉన్న రాజేష్, మద్యానికి బానిసయ్యాడు. ఇంట్లో ఉరివేసుకున్నట్లు చుట్టుపక్కల వారు గమనించి 100కు డయల్ చేశారు. పట్టణ పోలీసులు మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కుటుంబ కలహాలతో ఉద్యోగి..



లక్ష్మీపతి రెడ్డి (ఫైల్)

బుక్కరాయసముద్రం మండలం దయ్యాలకుంటపల్లి వద్ద రెవెన్యూ ఉద్యోగి లక్ష్మీపతి రెడ్డి(46) ఉరివేసుకున్నాడు. కూడేరు మండలం గొటుకూరుకు చెందిన లక్ష్మీపతిరెడ్డి కళ్యాణదుర్గం ఆర్డీఓ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నాడు. క్రిష్ణవేణి అనే మహిళతో 15 సంవత్సరాల క్రితం వివాహం అయింది. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. పదేళ్ల క్రితం క్రిష్ణవేణి అనారోగ్యంతో మృతి చెందారు. దీంతో తన అక్క కూతురు శ్రీవాణిని వివాహం చేసుకున్నాడు. వీరికి ఒక కూతురు పుట్టింది. వివాహం జరిగిన రెండేళ్ల తరువాత కలహాలు తలెత్తాయి. దీంతో ఆరేళ్ల నుంచి శ్రీవాణి భర్తకు దూరంగా ఉంటున్నారు. ప్రస్తుతం పెద్ద భార్య కూమారుడు, కూతురుతో కలిసి అనంతపురంలోని ద్వారాకా విల్లాస్‌లో ఉంటున్నాడు. రెండో భార్య కాపురానికి రాకపోవడంతో మంగళవారం రాత్రి ఆమె పుట్టినిల్లు దయ్యాలకుంటపల్లికి వెళ్లాడు. ఆ సమయంలో వాగ్వాదం జరిగిందని పోలీసులు తెలిపారు. ఈ క్రమంలో జీవితంపై విరక్తి దయ్యాలకుంటపల్లి నరసమ్మ గుడి వద్ద చెట్టుకు ఉరివేసుకున్నాడని తెలిపారు. స్థానికులు బుధవారం ఉదయం చూసి పోలీసులుకు సమాచారం ఇచ్చారు. కేసు నమోదు చేసుకుని, వివిధ కోణాల్లో దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శేషగిరి తెలిపారు.

పథకాలు అమలు చేసినపుడే సత్ఫలితాలు

సమష్టిగా పీఎం, సీఎం ఆశయాలు నెరవేరుద్దాం

20 సూత్రాల అమలు కమిటీ ఛైర్మన్ లంకా దినకర్



సమీక్షలో మాట్లాడుతున్న లంకా దినకర్

అనంతపురంటౌన్, జనవరి 29(ఆంధ్రజ్యోతి): ప్రజల సంక్షేమం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన పథకాలను సక్రమంగా అమలు చేసినపుడే సత్ఫలితాలు వస్తాయని 20సూత్రాల అమలు కమిటీ ఛైర్మన్ లంకాదినకర్ సూచించారు. జిల్లా పర్యటనకు వచ్చిన ఆయన కలెక్టరేట్‌లో అధికారులతో బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం, జల్‌జీవన్, గ్రామీణ సడక్ యోజన, లక్‌పతిదీదీ, అమృత్‌పథకం, కల్యాణ్ అన్నయోజన, పీఎంసూర్యఘర్, పీఎం ఆవాస్‌యోజన, పీఎం విశ్వకర్మ తదితర పథకాలను పక్కాగా అమలు చేయాలన్నారు. వైసీపీ పాలనలో ఉపాధి పనులు చేయకపోయినా, చేసినట్లు దొంగబిల్లులు పెట్టి దోచుకున్నారన్నారు. అమృత్ పథకం ద్వారా మున్సిపాలిటీలకు తాగునీరు అందిస్తున్నట్లు తెలిపారు. ఈ పథకానికి సబంధించి నిధుల ఖర్చులో నిర్లక్ష్యం కనిపిస్తోందన్నారు. అందరూ సమష్టిగా పని చేసి పీఎం వికసిత్ భారత్, సీఎం స్వర్ణాంధ్ర ఆశయం నెరవేరుద్దామని పిలుపునిచ్చారు. సమావేశంలో జేసీ శివనారాయణ శర్మ, డీఆర్ఓ మలోల, వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు

అనంతపురం సెంట్రల్: అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందేలా కృషి చేస్తానని 20 సూత్రాల కమిటీ ఛైర్మన్ లంకా దినకర్ పేర్కొన్నారు. స్థానిక బీజేపీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పథకాలను అమలు చేస్తున్నాయన్నారు. కాంగ్రెస్ పార్టీ అంబేడ్కర్ పేరుతో రాజకీయం చేస్తోందని విమర్శించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాజేష్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో మాజీ జిల్లా అధ్యక్షుడు సందిరెడ్డి శ్రీనివాసులతోపాటు పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జనాభా ప్రాతిపదికన బడ్జెట్ కేటాయించాలి



మాట్లాడుతున్న రవిశంకర్

అనంతపురం క్లాక్‌టవర్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): కేంద్ర బడ్జెట్‌లో ఎస్సీ, ఎస్టీల సంక్షేమా నికి ప్రస్తుత జనాభా ప్రాతిపదికన నిధులు కేటాయించాలని ఆలిండియా ఎస్సీ ఎస్టీ గెజిటెడ్ అధికారుల సంక్షేమ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి రవిశంకర్ డిమాం డ్ చేశారు. స్థానిక ఎన్జీఓహోంలో బు ధవారం ఆయన మాట్లాడుతూ కేంద్రబడ్జెట్‌లో ప్రస్తుత ఎస్సీ, ఎస్టీ జనాభా ప్రాతిపదికన రూ.12లక్షల కోట్లు కేటాయించాలన్నారు. గత ఆర్థిక సంవత్సరంలో కేంద్రబడ్జెట్ రూ.48లక్షల కోట్లలో ఎస్సీ, ఎస్టీలకు రూ.13,500 కోట్లు మాత్రమే కేటాయించడం దారుణమన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలోనైనా జనాభా ప్రాతిపదికన ఎస్సీ ఎస్టీలకు బడ్జెట్‌లో నిధులు కేటాయించి పురోగతిలో భాగస్వాములను చేయాలని కోరారు. ఈ విషయంపై ఇప్పటికే కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌ను కలిసి విన్నవించినట్లు తెలిపారు. కార్యక్రమంలో సంఘం జిల్లా నాయకుడు సుగప్ప పాల్గొన్నారు.

నేటి నుంచి సౌత్‌జోన్ వెటరన్ క్రికెట్ పోటీలు

అనంతపురం క్లాక్‌టవర్, జనవరి 29(ఆంధ్రజ్యోతి): సౌత్‌జోన్ వెటరన్స్ క్రికెట్ పోటీలు గురువారం నుంచి ఆర్డీటీ స్టేడియంలో నిర్వహించనున్నట్లు జిల్లా వెటరన్స్ క్రికెట్ సంఘం సభ్యులు తెలిపారు. ఈ పోటీల్లో ఆంధ్రా, హైదరాబాద్, తమిళనాడు జట్లు పాల్గొననున్నట్లు తెలిపారు. ఈనెల 30 నుంచి ఫిబ్రవరి 2 వరకు పోటీలు సాగుతాయన్నారు.

ప్రతి నెలా వ్యథే..!

శ్రీరామిరెడ్డి కార్మికులకు అందని వేతనాలు

ఆరు నెలలుగా చెల్లించని కాంట్రాక్టర్
పట్టించుకోని అధికారులు..
మరోసారి సమ్మెకు సిద్ధం!



అనంతపురం న్యూటౌన్, జనవరి 29(ఆంధ్రజ్యోతి): వేతనం అందాలంటే సమ్మె చేయాల్సిన పరిస్థితి వచ్చిందని శ్రీరామిరెడ్డి నీటి పథకం కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆరు నెలలుగా వీరికి వేతనాలు ఇవ్వడం లేదు. దీంతో కుటుంబ పోషణ భారమై తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారుల నిర్లక్ష్యం, కాంట్రాక్టర్ లెక్కలేనితనంతో కార్మికులు తిప్పలు పడుతున్నారు. శ్రీరామిరెడ్డి తాగునీటి పథకంలో దాదాపు 650 మంది కార్మికులు ఔట్‌సోర్సింగ్ ప్రాతిపదికపై పని చేస్తున్నారు. ఈ పథకం ద్వారా కళ్యాణదుర్గం, రాయదుర్గం, ఉరవకొండతో పాటు మడకశిర, హిందూపురం, అమరాపురం మండలాల పరిధిలోని దాదాపు 1050 గ్రామాలకు నీటిని సరఫరా చేస్తున్నారు. గత వారంలో అధికారులతో చర్చలు జరిపేందుకు కార్మిక నాయకులు జిల్లా కేంద్రానికి వచ్చారు. అయితే ఉన్నతాధికారులు ఇతర పనులపై క్షేత్రస్థాయి పర్యటనలకు వెళ్లడంతో కార్మికులు సాయంత్రం వరకు ఎదురు చూసి వెనుతిరిగారు. అయితే జిల్లా కేంద్రంలోని ప్రధాన నాయకులతో చర్చలు జరిపి, అధికారులను సంప్రదించి వారి నుంచి స్పందన లేదంటే సమ్మె తప్పదన్న సంకేతాలు కనబడుతున్నాయి. అధికారులతో చర్చలు జరిపిన ప్రతిసారి ఒకనెల లేదా రెండు నెలల వేతనం అందజేసి మమా అనిపించడం పరిపాటిగా మారింది. దీంతో కార్మికులు మళ్లీ ఆందోళన బాట పట్టాల్సి వస్తోంది. సత్యసాయి బోర్డు పరిధిలో ఉన్న కార్మికులకు మాత్రం ఎలాంటి సమస్య తలెత్తకుండా ప్రతినెలా వేతనాలు చెల్లిస్తున్నారు. బోర్డు పరిధిలో లేకుండా కాంట్రాక్టర్ ద్వారా వేతనాలు అందుకుంటున్న వారికి మాత్రం తిప్పలు తప్పడం లేదు. దీనికి తోడు కాంట్రాక్టర్ గడువు ముగియడం. తిరిగి టెండర్లు ఖరారు చేయకపోవడం కొంత ఇబ్బందికరంగా మారింది.

సమస్యలు పరిష్కరిస్తాం: సురేష్, ఎస్ఈ



శ్రీరామిరెడ్డి నీటి పథకం కార్మికులకు సంబంధించి టెండరు గడువు పూర్తి కావడంతో కొంత వరకు వేతనాలు చెల్లించడానికి ఇబ్బందిగా ఉంది. పాత కాంట్రాక్టర్ ద్వారా అయిన చెల్లిద్దామంటే నిధులు కొరత ఉంది. టెండరు పూర్తి చేసి బకాయి వేతనాలు చెల్లించేలా ప్రయత్నం చేస్తాం. ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు కాకపోవడంతోనే కొంత ఇబ్బందిగా ఉంది. వీటిని వీలైనంత త్వరగా పరిష్కరించేలా చూస్తాం.

పాత బిల్లులు చెల్లిస్తేనే..: రామారావు, డీఈ



ప్రస్తుత కాంట్రాక్టర్ గడువు ముగిసినప్పటికి రీటెండర్ నిర్వహించి కొత్త కాంట్రాక్టర్‌కు అప్పగించినా, పాత బకాయిలు చెల్లిస్తేనే కొత్తవారికి అప్పగించే వెసులుబాటు ఉంది. అయితే పాత వారి నుంచి వేతనాలు చెల్లించడానికి ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడం ఇబ్బందికరంగా మారింది. ప్రభుత్వం నుంచి నిధులు విడుదల చేసేలా ఉన్నతాధికారులతో చర్చించి సమస్యను పరిష్కరించేలా చూస్తాం.

మళ్లీ నష్టాలే

రైతులకు కన్నీరు పెట్టిస్తున్న ఎండుమిర్చి
తెగుళ్లతో తగ్గిన దిగుబడులు
గిట్టుబాటు కాని ధరలు





కల్లంలో ఎండుమిర్చిని ఆరబోసిన రైతులు.. మిర్చిని గ్రేడింగ్ చేస్తున్న కూలీలు

రాయదుర్గం రూరల్, జనవరి 29(ఆంధ్రజ్యోతి): మిర్చి పంట గత రెండు, మూడేళ్ల నుంచి రైతులకు నష్టాలనే మిగులుస్తోంది. ఈ ఏడాది కూడా ఎప్పటిలానే నష్టాలే వస్తున్నట్లు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. లక్షలాది రూపాయలు పెట్టుబడిగా పెట్టి సాగుచేస్తే ఒక వైపు దిగుబడి రాక మరో వైపు మార్కెట్‌లో ధర లేక రైతులు కుదేలవుతున్నారు. ప్రస్తుతం ఉన్న ధరలతో పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి కనిపించడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని వడ్రవన్నూరు, డీ.కొండాపురం, ఆవులదట్ల, గ్రామదట్ల, మెచ్చిరి, ఆర్‌బీవంక తదితర గ్రామాలలో బోరుబావుల కింద డబ్బి బేడిగి, సింజెంట్ మిరప రకాలను 55 ఎకరాల్లో సాగుచేశారు. ఈ ఏడాది వర్షాలు సమృద్ధిగా కురవడంతో దిగుబడి ఆశాజనకంగా ఉన్నప్పటికీ ఆశించిన స్థాయిలో ధరలు లేవు. ఉన్న ఫలంగా ధరలు పడిపోవడానికి తోడు కూలీల ఖర్చులు, ఎరువులు, పురుగుల మందులు ధరలు పెరగడం రైతులకు భారంగా మారింది. మిర్చి రైతు ఎకరానికి రూ. 50 వేల నుంచి రూ.1.30 లక్షల వరకు పెట్టుబడి పెట్టాల్సి వస్తోంది. ప్రస్తుతం పంటకోత పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఎకరానికి 25 నుంచి 30 క్వింటాలు రావాల్సిన దిగుబడి ఆరు క్వింటాళ్ల నుంచి 10 క్వింటాలు మాత్రమే వస్తున్నట్లు రైతులు వాపోతున్నారు. పంటకు దోమ, నల్లితెగులు ఆశించడంతో దిగుబడి బాగా తగ్గిపోయింది. ప్రస్తుతం ఎండుమిర్చి క్వింటా రూ. 12 వేల నుంచి రూ. 20వేల వరకు పలుకుతోంది. గత రెండేళ్ల నుంచి ధరలు బాగా పడిపోయాయి. ఎండుమిర్చిని స్థానికంగా నిల్వ ఉంచలేక కర్ణాటకలోని బ్యాడిగి, గుంటూరు, హైదరాబాద్ తదితర ప్రాంతాలకు తరలించి గోదాములలో నిల్వ ఉంచుతున్నారు. ప్రభుత్వం మద్దతు ధర కల్పించకపోవడంతో నష్టపోతున్నామని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం స్పందించి పంటను నిల్వ చేసుకునేందుకు గోదాములు, రైతులు పండించిన పంటకు మద్దతు ధర కల్పించాలని రైతులు కోరుతున్నారు.

మూడేళ్లుగా నష్టపోతున్నాం



గత మూడేళ్ల నుంచి మిర్చిపంటను సాగుచేసి నష్టపోతున్నాం. గత ఏడాది కంటే ఈ ఏడాది ఎండుమిర్చి ధరలు పడిపోవడంతో తీవ్రంగా నష్టపోవాల్సి వస్తోంది. ఎకరా మిర్చి సాగుకు రూ. లక్షకు పైగా ఖర్చు చేస్తున్నా కనీసం పెట్టుబడి కూడా దక్కడం లేదు. ఈ ఏడాది పంటకు తెగుళ్లు సోకడంతో దిగుబడి తగ్గిపోయింది.
-అశోక్, రైతు, వడ్రవన్నూరు

భారం అవుతోంది



పంటసాగు ఖర్చులు కూడా పెరగడంతో వ్యవసాయం భారమవుతోంది. నాకున్న ఆరు ఎకరాల పొలంలో మిర్చి సాగుకు దాదాపు రూ. 8 లక్షల వరకు ఖర్చుపెట్టా. పంట చేతికందిన తర్వాత అమ్మగా రూ. 2.26 లక్షలు చేతికందింది. ఖర్చులు విపరీతంగా పెరిగాయి. దిగుబడి తగ్గడం, గిట్టుబాటు ధర లేకపోవడంతో తీవ్రంగా నష్టపోవాల్సి వచ్చింది.
-శ్రీనివాసులు, రైతు, కొండాపురం

తెగుళ్లతోనే తీవ్ర నష్టం



ఆరు ఎకరాలలో మిర్చి పంట సాగుచేశా. వాతావరణంలో మార్పులు రావడంతో పంటపై తెగుళ్ల ప్రభావం తీవ్రంగా చూపింది. వేల రూపాయలు వెచ్చించి పురుగులమందును పిచికారీ చేసినా ఫలితం లేకుండా పోయింది. పంట పూత, కాయ దశలో ఉన్నపుడు తెగుళ్లు సోకడంతో దిగుబడి పూర్తిగా తగ్గింది. మార్కెట్‌లో ధర లేకపోవడంతో లక్షల్లో నష్టం భరించాల్సి వచ్చింది.
- రాజశేఖర్‌రెడ్డి, రైతు, గ్రామదట్ల

చిరుత దాడిలో ఆవు మృతి



ఆవు కళేబరాన్ని పరిశీలిస్తున్న అటవీశాఖ అధికారి

కళ్యాణదుర్గం రూరల్, జనవరి 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని చాపిరి గ్రామ సమీప పొలాల్లో గత కొన్ని రోజులుగా చిరుతల దాడిలో గొర్రెలు, పాడి పశువులు మృతి చెందుతున్నాయి. రైతు హరికృష్ణకు చెందిన ఆవు బుధవారం చిరుత దాడిలో బుధవారం మృతి చెందింది. సమాచారం అందుకున్న అటవీశాఖ అధికారులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి పంచనామా నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ నిత్యం పశువులు, గొర్రెలపై చిరుతలు దాడి చేయడంతో ఆర్థికంగా నష్టపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. అటవీశాఖ అధికారులు చర్యలు చేపట్టడంలో విఫలమవుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులు నిద్రమత్తు వీడి చిరుతలను బంధించాలని చాపిరి గ్రామ రైతులు కోరుతున్నారు.

100 శాతం సబ్సిడీ

పశుగ్రాసం సాగుకు ఉపాధి నిధులు
50 సెంట్ల వరకు రాయితీ వర్తింపు



పశుగ్రాసం సాగు

కొత్తచెరువు, జనవరి 29(ఆంధ్రజ్యోతి): పాడి పరిశ్రమ అభివృద్ధికి కూటమి ప్రభుత్వం పెద్ద పీట వేస్తోంది. ఇప్పటికే మినీ గోకులాల పథకం కింద షెడ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. చిన్న, సన్నకారు రైతులకు జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద పశుగ్రాసం సాగుకు ప్రభుత్వం వందశాతం రాయతీ వర్తింపజేస్తోంది. పశుపోషకులు ఆయా మండలాల్లోని పశువైద్యశాలల ద్వారా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ఒక్కో రైతుకు గరిష్ఠంగా 50 సెంట్లలో (అర ఎకరా) పశుగ్రాసం సాగుకు పూర్తిస్థాయి సబ్సిడీ వర్తింపజేస్తోంది. దీంతో చిన్న, సన్నకారు రైతులు పశుగ్రాసం సాగుకు ముందుకు వస్తున్నారు.

వెయ్యి ఎకరాలు లక్ష్యంగా...

జిల్లావ్యాప్తంగా వెయ్యి ఎకరాల్లో పశుగ్రాసం సాగు లక్ష్యంగా నిర్ధేశించారు. ఆ మేరకు యంత్రాంగం చర్యలు చేపడుతోంది. రైతులకు అవగాహన కల్పిస్తోంది. ఇప్పటి వరకు జిల్లావ్యాప్తంగా 653 మంది రైతులు 316 ఎకరాల్లో గ్రాసం సాగుకు దరఖాస్తు చేసుకున్నట్లు సమాచారం. దరఖాస్తుల సమర్పణ నిరంతర ప్రక్రియ అని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. 50 సెంట్లలో గడ్డిసాగుకు కూలీల ఖర్చుల కింద రూ.15 వేలు, గడ్డి విత్తనాలకు, పుల్ల ఖర్చుల కింద రూ.17,992 అందజేస్తారు. ఈ బిల్లులను క్షేత్రస్థాయిలో డ్వామా, పశువైద్య అధికారులు పరిశీలించి, ధృవీకరించిన అనంతరం రైతులకు బిల్లులు మంజూరవుతాయి.

అర్హతలు ఇవీ..

పశుగ్రాసం సాగుకు దరఖాస్తు చేసుకొనే రైతులు 5 ఎకరాల్లోపు భూమి కలిగి ఉండాలి. ఉపాధి జాబ్ కార్డు కలిగి ఉండాలి. ఆయా రైతులు స్థానిక పశువైద్యశాలలో గానీ, రైతుసేవాకేంద్రాల్లో గానీ దరఖాస్తులు చేసుకోవచ్చు. పొలానికి సంబంధించిన 1బీ, ఆధార్, రేషన్ కార్డులు, బ్యాంకు పాసుపుస్తకం జిరాక్సు (నకలు) పత్రాలను జతచేయాల్సి ఉంటుంది. అనంతరం గ్రామసభల ద్వారా లబ్ధిదారులను అధికారులు ఎంపిక చేస్తారు.

రైతులకు అవగాహన కల్పిస్తున్నాం

పశుగ్రాసం సాగు పెంచే దిశగా రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. దరఖాస్తులను త్వరితగతిన పరిశీలించి, మంజూరు చేస్తాం.
- శుభదాస్, జిల్లా పశువైద్యాధికారి

డిగ్రీ పరీక్షల్లో 90 శాతం పాస్



ఫలితాలను విడుదల చేస్తున్న ఎస్కేయూ రిజిస్ట్రార్ రమేష్‌బాబు

అనంతపురం సెంట్రల్, జనవరి 29(ఆంధ్రజ్యోతి): కేఎస్ఎన్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రథమ సెమిస్టర్ పరీక్షా ఫలితాల్లో 90శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. కళాశాల ప్రిన్సిపాల్ సత్యలత ఆధ్వర్యంలో ఎస్కేయూ రిజిస్ట్రార్ రమేష్‌బాబు, డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్ జీవీ రమణ, సీఈ డాక్టర్ లోకేష్ ఫలితాలను బుధవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ రమేష్‌బాబు మాట్లాడుతూ స్వయం ప్రతిపత్తిని సాధించిన కేఎస్ఎన్ కళాశాల అత్యుత్తమ ఫలితాలు సాధించడం హర్షణీయమని తెలిపారు. 647 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 584మంది పాస్ అయ్యారు. దీంతో పాస్‌శాతం 90.26గా నమోదనైనట్లు ప్రిన్సిపాల్ సత్యలత వివరించారు. రీవాల్యుయేషన్‌కు రూ.300, ఫిజికల్ వెరిఫికేషన్ కోసం రూ.600 చొప్పున ఫిబ్రవరి 6లోపు చెల్లించాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల సీఈ శివశంకర్‌రెడ్డి, ఈసీఈ రమణనాయుడు, అధ్యాపకులు రామలింగారెడ్డి, రామకృష్ణ, అంజనరెడ్డి, తిమ్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

‘పేరూరు’కు నిధులు ఇవ్వండి

ఆర్థిక మంత్రి కేశవ్‌కు ఎమ్మెల్యే పరిటాల సునీత, శ్రీరామ్ వినతి



పయ్యావుల కేశవ్‌తో చర్చిస్తున్న పరిటాల సునీత, పరిటాల శ్రీరామ్

అనంతపురం, జనవరి 29(ఆంధ్రజ్యోతి): పేరూరు కాలువ నిర్మాణం, భూసేకరణకు నిధులు కేటాయించాలని ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్‌కు రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత, టీడీపీ ధర్మవరం నియోజకవర్గ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్ విజ్ఞప్తి చేశారు. మంత్రిని అనంతపురంలోని ఆయన నివాసంలో బుధవారం కలిశారు. అంతకు ముునుపు తమ నివాసంలో హంద్రీనీవా అధికారులతో సమావేశమయ్యారు. జీడిపల్లి నుంచి పేరూరు ప్రాజెక్టుకు నీరందించే పనుల పురోగతిపై చర్చించారు. భూసేకరణ, కాలువలు, పంప్‌హౌస్‌లు, రిజర్వాయర్ల నిర్మాణానికి అవసరమైన నిధుల వివరాలు తీసుకున్నారు. సమగ్ర సమాచారంతో మంత్రి కేశవ్‌ను కలిశారు. జీవో 59 ప్రకారం జీడిపల్లి నుంచి పేరూరు ప్రాజెక్టు వరకూ 54 కి.మీ. కాలువ తవ్వాల్సి ఉందని మంత్రికి వివరించారు. వైసీపీ పాలనలో ఈ పనులు ఒక్క అడుగూ ముందుకు పడలేదని అన్నారు. పేరూరు ప్రాజెక్టు కాలువ కోసం 266 ఎకరాల భూసేకరణకు రూ.14 కోట్లు సీఎఫ్ఎంఎస్‌లో అప్‌లోడ్ చేశారని, నిధులను వెంటనే విడుదల చేయాలని కోరారు. భూసేకరణ కోసం రూ.51 కోట్లు కేటాయించాలని కోరారు. పేరూరు కాలువ పనులకు రూ.200 కోట్లు విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. హంద్రీనీవా లైనింగ్ పనులపై రైతుల నుంచి తీవ్ర అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయని, లైనింగ్‌కు బదులుగా కాలువ వెడల్పు చేయాలని కోరారు. లైనింగ్ తప్పదని భావిస్తే.. అడుగు భాగాన్ని వదిలేయాలని కోరారు. ననసకోట ఎంజేపీ బాలికల గురుకుల పాఠశాలలో జూనియర్ కాలేజీ ఏర్పాటుకు ఫైనాన్షియల్ క్లియరెన్స్ ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. సీఎం చంద్రబాబుతో చర్చించి, నిధుల కేటాయిస్తామని మంత్రి హామీ ఇచ్చారు.

తాగునీటి సమస్య రానివ్వొద్దు

వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలని ఎమ్మెల్యే పరిటాల సునీత ఆదేశించారు. అనంతపురంలోని తనక్యాంప్ కార్యాలయంలో శ్రీసత్యసాయి జిల్లా ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో బుధవారం సమావేశమయ్యారు. చెన్నేకొత్తపల్లి, రామగిరి, కనగానపల్లి మండలాల్లో తాగునీటి అవసరాల గురించి చర్చించారు. సమస్యాత్మక గ్రామాలను గుర్తించామని, అవసరం మేరకు ట్యాంకర్ల ద్వారా నీరు సరఫరా చేస్తామని అధికారులు తెలిపారు. బోర్లలో నీరు తగ్గితే మరింత లోతు తవ్వుతామని, పొలాల నుంచి నీటిని సరఫరా చేసే మార్గాలను పరిశీలిస్తున్నామని వివరించారు. గొల్లపల్లి రిజర్వాయర్ నుంచి మూడు మండలాల పరిధిలో ఇంటింటికీ తాగునీరు అందించే పథకం గురించి ఎమ్మెల్యే ఆరా తీశారు. రూ.340 కోట్లతో చేపడుతున్న ఈ ప్రాజెక్టుకు సమగ్ర ప్రణాళికలు రూపొందించాలని సూచించారు.

పింఛన్‌లకు రూ.124.94 కోట్లు

అనంతపురం క్లాక్‌టవర్, జనవరి 29(ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ భరోసా పింఛన్లను ఫిబ్రవరి ఒకటోతేదీ ఉదయం నుంచే పంపిణీకి ఏర్పాట్లు చేశారు. జిల్లాలో 2,82,754 మంది పింఛన్‌దారులకు రూ.124.90 కోట్లు విడుదలయ్యాయి. పింఛన్ సొమ్మును శుక్రవారం బ్యాంకుల నుంచి సిబ్బంది డ్రా చేసుకుని శనివారం ఉదయం 6 గంటల నుంచే పంపిణీ చేయాలని డీఆర్‌డీఏ-వెలుగు పీడీ ఈశ్వరయ్య తెలిపారు.

హాకీ విజేత శ్రీసత్యసాయి జిల్లా జట్టు

అనంత జట్టుకు తృతీయ స్థానం
ముగిసిన రాష్ట్రస్థాయి
బాలికల సబ్‌జూనియర్ హాకీ పోటీలు



విజేత శ్రీసత్యసాయి జిల్లా జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న పరిటాల శ్రీరామ్

అనంతపురం క్లాక్‌టవర్, జనవరి 29(ఆంధ్రజ్యోతి): ఏపీ రాష్ట్రస్థాయి బాలికల సబ్‌జూనియర్ హాకీ పోటీల విజేతగా శ్రీసత్యసాయి జిల్లా జట్టు నిలిచింది. మూడు రోజులుగా స్థానిక ఆర్డీటీ స్టేడియంలో నిర్వహిస్తున్న ఫాదర్ ఫెర్రర్ 13వ ఏపీ సబ్‌జూనియర్ హాకీ బాలికల రాష్ట్రస్థాయి పోటీలు బుధవారం ముగిశాయి. మొదటి స్థానంలో శ్రీసత్యసాయి జిల్లా జట్టు, ద్వితీయ స్థానంలో కడప, తృతీయ స్థానంలో అనంతపురం జట్లు నిలిచాయి. ముఖ్య అతిథులుగా హాజరైన టీడీపీ యువ నాయకుడు పరిటాల శ్రీరామ్ చేతుల మీదుగా విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడల పట్ల ప్రతి విద్యార్థి ఆసక్తి పెంచుకుని, ఆటల్లో రాణించాలని ఆకాంక్షించారు. జిల్లా స్థాయి నుంచి రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకోవాలన్నారు. కార్యక్రమంలో హాకీ అనంతపురం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు విజయబాబు, అనిల్ కుమార్, శ్రీసత్యసాయి జిల్లా కార్యదర్శి సూర్యప్రకాష్, ఉపాధ్యక్షుడు హనీష్, హసీన్, టోర్నమెంట్ డైరెక్టర్లు రాజశేఖర్, సెల్వపాండ్యా, మహ్మద్‌సాహిల్, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

టమోటా కిలో రూ.13



అనంతపురం రూరల్, జనవరి 29(ఆంధ్రజ్యోతి): స్థానిక కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ. 13తో అమ్ముడు పోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. మార్కెట్‌కు బుధవారం 525 టన్నుల టమోటా దిగుబడులు వచ్చాయన్నారు. కిలో సరాసరి ధర రూ.9, కనిష్ఠ ధర రూ.7 పలికినట్లు ఆయన తెలిపారు.

చీనీ టన్ను రూ.18వేలు



అనంతపురం రూరల్, జనవరి 29(ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో బుధవారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ. 18,650 పలికినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి గోవిందు తెలిపారు. కనిష్ఠంగా రూ. 6,100, సరాసరి రూ. 14వేలతో అమ్ముడు పోయినట్లు తెలిపారు. మార్కెట్‌కు మొత్తం 13 టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

మేలైన యజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు


జిల్లా వ్యవసాయాధికారి సుబ్బారావు

కదిరిఅర్బన్, జనవరి29(ఆంధ్రజ్యోతి): మేలైన యజమాన్య పద్ధతులను పాటించడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని జిల్లా వ్యవసాయాధికారి సుబ్బారావు పేర్కొన్నారు. స్థానిక వ్యవసాయ పరిశోధన కేంద్రంలో పంటల్లో యజమాన్య పద్ధతులపై బుధవారం ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. జిల్లా వ్యవసాయాధికారి మాట్లాడుతూ.. రబీలో సూక్ష్మధాతు లోపాలు అధికంగా ఉంటాయన్నారు. వాటి నివారణకు ఫార్ములా-4, 19-19-19 ఎకరాకు అరకేజీ చొప్పున వేయాలన్నారు. దీంతో సూక్ష్మధాతు లోపాలు తగ్గి, వేరుశనగలో మంచి దిగుబడి సాధించవచ్చన్నారు. మొక్కజొన్నలో కత్తెర పురుగు నివారణకు ఇమామేటింగ్ బెంజోయేట్ లీటరు నీటిలో 4గ్రాములు పిచికారీ చేయాలన్నారు వేరుశనగలో ఆకుపచ్చ తెగుళ్ల నివారణకు ఎక్సాకోనోజోన్ 2.మి.మీ. - టెబ్యూకోనోజోల్ 1మి.మీ. లీటరు నీటిలో కలిపి, పిచికారీ చేయాలన్నారు. వాతావరణ పరిస్థితులు తెగుళ్లకు అనుకూలంగా ఉంటే 15 రోజుల తరువాత మరోసారి పిచికారీ చేయాలని ఆయన వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయ శాస్త్రవేత్తలు నరసింహులు, రమేష్‌నాయక్, అనిత, ఏడీఏలు సత్యనారాయణ, రామసుబ్బయ్య, క్రిష్ణయ్య, స్వయంప్రభ, క్రిష్ణమీనన్, ఏఓలు పాల్గొన్నారు.

రిజర్వాయరుకు ఇన్‌ఫ్లో

934 క్యూసెక్కులు

బెళుగుప్ప, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జీడిపల్లి రిజర్వాయరుకు ఇన్‌ఫ్లో 934 క్యూసెక్కులు ఉన్నట్లు బుధవారం హంద్రీనీవా అధికారులు తెలిపారు. ఔట్‌ఫ్లో కింద హెచ్ఎన్ఎస్ఎస్ ఫేజ్-2కు 465 క్యూసెక్కులు వెళుతున్నాయని వివరించారు. ప్రస్తుతం రిజర్వాయరులో 1.681 టీఎంసీల నీరు నిల్వ వుందని వెల్లడించారు.



ఆకాశంలో వింత ఆకారం

ఆకాశంలో బుధవారం తెల్లవారుజామున వింత ఆకారం కనిపించింది. ఎరుపు వర్ణంలో ఉన్న ఆకాశంలో కాంతివంతమైన రేఖలాంటి ఆకారం కనువిందు చేసింది. ఆ వింతను చూసి జానం ఆశ్చర్యపోయారు. గంటకుపైగా కనిపించడంతో జనం మైమరచిపోయి వీక్షించారు. - బత్తలపల్లి/శెట్టూరు(ఆంధ్రజ్యోతి)

టీచర్లు వ్యక్తిగత వివరాలను సరిచూసుకోవాలి

కొత్తచెరువు, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): టీచర్ల సమాచార స్టేటస్ (టీఐఎస్)లో వ్యక్తిగత వివరాలను సరిచూసుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారి (డీఈఓ) కిష్టప్ప బుధవారం ప్రకటనలో తెలిపారు. తప్పులుంటే ఈనెల 31వ తేదీలోగా డీడీఓ (డ్రాయింగ్, డిస్‌పర్స్‌మెంట్ అధికారి) లాగిన్‌లో సరిచేసుకోవాలన్నారు. సరిచేసుకోకపోతే బదిలీలు, ఉద్యోగోన్నతుల్లో దొర్లే తప్పిదాలకు విద్యాశాఖ అధికారులు బాధ్యులు కారని డీఈఓ వెల్లడించారు.

ఆంధ్రజ్యోతి డైలీ క్లాసిఫైడ్స్ DAILY CLASSIFIEDS

బంగారం కొనబడును
మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్, ఫైనాన్స్‌లో తాకట్టులో వున్నవి మా డబ్బుతో విడిపించి కొనబడును. స్పాట్ క్యాష్, షిఫ్టింగ్ చేయబడును.(రిటైర్డు పోలీస్ డిపార్టుమెంట్) గోల్డెన్ ట్రేడింగ్ కంపెనీ. సంప్ర॥ 7382114647
AJA- 224897

PLOT FOR SALE
అనంతపురం పట్టణం నందు పాతవూరు, సుభాష్ రోడ్, ఐరన్ బ్రిడ్జి ప్రక్కన 12 సెంట్లు కమర్షియల్‌స్థలము, ఉత్తరము రోడ్ 54×100 కొలతలు గల స్థలము అమ్మబడును. సెల్: 9866366468,9440316745
AJA-198231

దుర్గాదేవి జ్యోతిష్య పీఠం
దుర్గాదేవి జ్యోతిష్య పీఠం: ఉద్యోగం, వివాహ ఆలస్యం, అనారోగ్యం, పునర్ వివాహము, దాంపత్య సమస్యలు, స్త్రీ ప్రేమ, ఆర్థిక ఇబ్బందులు మరియు మీ జాతక సమస్యల కొరకు రాఘవేంద్ర జోషి గార్ని సంప్రదించండి. ✆ 6364999444
AJB - 464

ఆంధ్రజ్యోతి క్లాసిఫైడ్స్ చిన్న ప్రకటన పెద్ద స్పందన

గాయత్రి జ్యోతిష్యం
పండిట్ ఎస్.వి.శాస్త్రిగారు 50సం॥లుగా ఆంధ్ర, కర్నాటకలో ప్రసిద్ధి చెందినారు. విద్య, స్త్రీ పురుష ప్రేమ, లగ్నం, సంతానం,స్త్రీ పురుష వశీకరణ, వ్యాపార ఆర్థిక కుటుంబ సమస్యలకు సంప్ర:9440532926.
AJA-226725

GOVT ఆఫీస్ ఆటోమేషన్ కోర్స్
ఫీజు: 20% రాయితీతో రూ.7,200, సీట్స్25 Q:10th లాస్ట్ డేట్ జనవరి 31, అడ్రస్: సాయి ఇన్‌స్టిట్యూట్, కమలానగర్, ATP, 9059723829,7569033379
AJA-224894

GOVT యోగ సర్టిఫికేట్ కోర్స్
ఫీజు: 50% రాయితీతో రూ.12,000, సీట్స్6 Q: ఇంటర్ / డిప్లొమా, లాస్ట్ డేట్ జనవరి 31, సాయి ఇన్‌స్టిట్యూట్, కమలానగర్, ATP, 9059723829,7569033379
AJA-224895

GOVT బ్యూటీషియన్ కోర్స్
ఫీజు: 50% రాయితీతో రూ.12,000, సీట్స్5 Q:10th లాస్ట్ డేట్ జనవరి 31, అడ్రస్: సాయి ఇన్‌స్టిట్యూట్, కమలానగర్, ATP, 9059723829,7569033379
AJA-224893

పాఠకులకు ముఖ్య గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటి

న్యూస్ బాక్స్

మహాశివరాత్రి ఉత్సవాల పోస్టర్లు విడుదల

ఆత్మకూరు జనవరి 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని పంప నూరు సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో వచ్చేనెల 3వ తేదీన మహాశివరాత్రి ఉత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ కార్యనిర్వాహణాధికారి బాబు తెలిపారు. ఉత్సవాలకు ముఖ్య అతిథిగా హాజరవ్వాలని ఎమ్మెల్యే పరిటాల సునీతను బుధవారం నగరంలోని ఆమె క్యాంపు కార్యాలయంలో ఆహ్వానించినట్లు పేర్కొన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని కోరారు. ఆమె చేతుల మీదుగా పోస్టర్లు ఆవిష్కరించినట్లు ఈఓ తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ మండల ఇన్‌చార్జి బాలాజీ, మండల కన్వీనర్ శ్రీనివాసులు, పార్లమెంటు అధికార ప్రతినిధి శశాంక చౌదరి, ప్రధాన అర్చకులు రాముస్వామి, ఆనంద్ సిబ్బంది తదితరులు పాల్గొన్నట్లు తెలిపారు.

మిలటరీ స్కూల్‌కు అనంత విద్యార్థి ఎంపిక



విద్యార్థిని అభినందిస్తున్న డైరెక్టర్లు

అనంతపురం విద్య జనవరి 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రీయ మిలటరీ స్కూల్‌కు స్థానిక రఘు సైనిక్ స్కూల్ విద్యార్థి ఎంపికైనట్లు స్కూల్ డైరెక్టర్లు రాఘవేంద్ర, గురుప్రసాద్ తెలిపారు. ఎంపికైన విద్యార్థి లింగాల యువరాజ్‌ను వారు బుధవారం అభినందించారు. గత నెల 3వ తేదీ బెంగళూరులో రాష్ట్రీయ మిలటరీ స్కూల్ పరీక్షలు నిర్వహించారన్నారు. విద్యార్థి లింగాల యువరాజ్ (హాల్ టికెట్ 615615) ఆ పరీక్షల్లో అర్హత సాధించినట్లు తెలిపారు. 2025-26 విద్యా ఏడాదికి సంబంధించి 6వ తరగతికి అర్హత సాధించాడన్నారు. దేశ వ్యాప్తంగా ఐదు సీట్లు ఉన్న ఓబీసీ కేటగిరీలో సీటు సాధించడం ప్రశంసనీయం అన్నారు.

ముగిసిన స్క్రిప్ట్ రైటింగ్ శిక్షణా తరగతులు

అనంతపురం కల్చరల్, జనవరి 29(ఆంధ్రజ్యోతి): అనంత లఘుచిత్రోత్సవాల్లో భాగంగా అనంతపురం షార్ట్‌ఫిల్మ్ సొసైటీ ఆధ్వర్యంలో ఆ సొసైటీ కార్యాలయంలో మంగళవారం నుంచి నిర్వహిస్తున్న స్క్రిప్ట్ రైటింగ్ శిక్షణా తరగతులు బుధవారం ముగిశాయి. హైదరాబాద్‌కు చెందిన రైటర్ దుర్గా రమేష్ హాజరై శిక్షణ ఇచ్చారు. దాదాపు 12 మంది ఔత్సాహికులు కథలను రాశారు. వాటిలో ఉత్తమ కథను ఎంపిక చేసి, జేఎం ఎస్ గ్యాలరీ ఆధ్వర్యంలో రూ.50వేల బడ్జెట్‌తో లఘుచిత్రాన్ని నిర్మించనున్నట్లు సొసైటీ అధ్యక్షుడు రషీద్‌బాషా తెలిపారు. అలాగే ఎంపికైన లఘుచిత్రాన్ని ఫిబ్రవరి 2న నిర్వహించే అవార్డుల ప్రదానోత్సవంలో వెల్లడిస్తామన్నారు. కార్యక్రమంలో అనంత షార్ట్‌ఫిల్మ్ సొసైటీ సభ్యులు కంబదూరి షేక్ నబిరసూల్, తోట బాటన్న, యాంకర్ రమేష్, టీవీ రెడ్డి, గోపాలకృష్ణ పాల్గొన్నారు.

ప్రతి దుకాణంలో సీసీ కెమెరాలుండాలి: సీఐ

గార్లదిన్నె, జనవరి 29(ఆంధ్రజ్యోతి): చోరీల నియంత్రణకు వ్యాపార సంస్థల నిర్వాహకులు తమ దుకాణాల వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సీఐ కౌలుట్లయ్య సూచించారు. స్థానిక పోలీస్‌స్టేషన్ ఆవరణంలో బుధవారం ఎస్ఐ మహమ్మద్‌గౌస్‌బాషాతో కలసి పలువురు వ్యాపారులతో ఆయన సమావేశం నిర్వహించి మాట్లాడారు. ప్రస్తుతం దొంగత నాలు ఎక్కువయ్యాయన్నారు. గుర్తుతెలియని వ్యక్తులు రాత్రిళ్లు చోరీలకు పాల్పడుతున్నారన్నారు. కావున దుకాణాలలో, బయట సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని, వాటి ద్వారా దొంగలను గుర్తించి పట్టుకోవచ్చన్నారు. వాహనాలు నడిపే ప్రతి ఒక్కరూ సీటుబెల్టు, హెల్మెట్ తప్పక ధరించాలని సూచించారు. సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. గ్రామాల్లో, దుకాణాల వద్ద అనుమాన వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని తెలియజేశారు.

రొబోటిక్, ఆటోమేషన్‌కు ఉజ్వల భవిష్యత్తు

అనంతపురం సెంట్రల్, జనవరి 29(ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్ విద్యతలో రొబోటిక్, ఆటోమేషన్‌పై పట్టుసాధించిన విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందని ఐసీటీ అకాడమి చైర్మన్ దినకర్‌రెడ్డి పేర్కొన్నారు. అనంతలక్ష్మి ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం ఉద్యోగ నైపుణ్య శిక్షణా తరగతులు నిర్వహించారు. ప్రిన్సిపాల్ రామమూర్తి అధ్యక్షతన ఐసీటీ, ఇన్ఫోసిస్ సంయుక్తాధ్వర్యంలో ఏర్పాటుచేసిన కార్యక్రమానికి దినకర్‌రెడ్డి, కళాశాల వైస్ చైర్మన్ రమేష్‌నాయుడు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.

నీ అంతు చూస్తా..!

- వైద్యశాఖలో ఓ అధికారికి మరో అధికారి బెదిరింపు
- టూటౌన్ పీఎస్‌లో కేసు నమోదు

అనంతపురం క్రైం, జనవరి 29(ఆంధ్రజ్యోతి): 'నా కుమార్తె విధులకు రావడం లేదని పై అధికారులకు లేఖ రాస్తావా? నీ అంతు చూస్తా. నీకు పెన్షన్ రాకుండా చేస్తా' అంటూ ఓ అధికారిని మరో అధికారి బెదిరించారు. ఈ ఘటనపై అనంతపురం టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. టూటౌన్ సీఐ శ్రీకాంత్ తెలిపిన మేరకు ఉరవకొండ యూనిట్ మలేరియా ఆఫీసర్ కోదండరామిరెడ్డి కుమార్తె పామిడిలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్‌గా పనిచేస్తున్నారు. కొన్ని నెలల క్రితం ఆమె డెలివరీ అయింది. తొలుత మెటర్నిటీ లీవ్ కింద ఆర్నెల్లు సెలవు తీసుకున్నారు. అనంతరం చైల్డ్ కేర్‌కు సంబంధించి మరో 180 రోజులుకు సంబంధించి 5నెలలు తీసుకున్నారు. మరో నెలలో కొన్నిరోజులు గడిచాయి. వాస్తవానికి ఈ సెలవులన్నీ ఒకేసారి తీసుకోకూడదని నిబంధన ఉంది. ఈ క్రమంలో ఆమె వరుసగా సెలవులు తీసుకుంటోందని, ఆఫీస్‌కు ఆబ్సెంట్ అవుతున్నట్లు పై అధికారులకు డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ హెల్త్ సర్వీసెస్ పాల్ రవికుమార్ లేఖ పంపారు. దీంతో ఆమె తండ్రి కోదండరామిరెడ్డి నగరంలోని సంబంధిత ఆఫీస్‌కు వచ్చి రవికుమార్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. నా కుమార్తెపైనే లేఖ రాస్తావా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఘటనపై తనను బెదిరించారని, తన విధులకు ఆటంకం కలిగించారని పాల్ రవికుమార్ టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో కోదండ రామిరెడ్డిపై కేసు నమోదు చేశారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని యువకుడి మృతి

అనంతపురం క్రైం, జనవరి 29(ఆంధ్రజ్యోతి): రూరల్ మండల పరిధిలోని ఆకుతోటపల్లి సమీపంలో శిల్పాలేపాక్షి నగర్ వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. కూడేరు మండలం ఉదిరిపికొండకు చెందిన మోహన్‌నాయక్(29) అనంతపురానికి వచ్చాడు. ఈ క్రమంలో ఎస్కేయూ వైపు వెళ్తుండగా అనంతపురం నుంచి కదిరికి వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఢీ కొంది. దీంతో తీవ్రగాయాలకు గురై మోహన్‌నాయక్ మృతి చెందాడు. ఈ ఘటనపై ఇటుకలపల్లి పోలీసులు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి ...

అనంతపురం క్రైం/ఆత్మకూరు, జనవరి 29(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఓ డ్రైవర్ చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఆత్మకూరు మండలం సనపకు చెందిన ఉప్పర పోతులయ్య(52) డ్రైవర్. మంగళవారం అనంతపురానికి బైక్‌లో వచ్చిన పోతులయ్య తిరిగి స్వగ్రామానికి బయలుదేరాడు. ఈ క్రమంలో ఆలమూరు రోడ్డులో గుడ్ చిల్డ్రన్స్ స్కూల్ సమీపంలో వెళ్తుండగా బైక్ అదుపుతప్పి కిందపడింది. దీంతో గాయపడిన అతడిని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందాడు. అనంతపురం రూరల్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నోటీసు బోర్డులపై పిచ్చి రాతలు

- జేఎన్‌టీయూలోని నూతన లెక్చరర్ హాల్‌లో..
- పట్టించుకోని ప్రొఫెసర్లు


తరగతుల భవన ప్రధాన ద్వారం వద్ద నోటీసు బోర్డుల్లో పిచ్చిరాతలు, గీతలు

అనంతపురం సెంట్రల్, జనవరి 29(ఆంధ్రజ్యోతి): కళాశాలలు, కార్యాలయాల రోజువారీ కార్యక్రమాలు, వివరాలను ప్రదర్శించేందుకు నోటీసు బోర్డులు ఏర్పాటుచేశారు. చేపట్టబోయే కార్యక్రమాలు, సెమినార్స్ తదితరాల వివరాలను వాటలో ప్రదర్శిస్తారు. వాటిని అమలుచేస్తున్నట్లు సంబంధిత విభాగాల అధికారుల సంతకాలు, ఆదేశాలతో జారీచేసిన ప్రకటనలను అక్కడ అతికిస్తారు. అయితే జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాల తరగతుల నిర్వహణ భవనంలో మాత్రం నోటీసు బోర్డుల్లో పిచ్చిరాతలు, గీతలను ప్రదర్శిస్తున్నారు. నూతనంగా నిర్మించిన లెక్చరర్స్ హాల్‌లో బీటెక్ ద్వితీయ, తృతీయ, నాలుగో సంవత్సరం విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్నారు. ఈ భవనంలోని మూడు అంతస్తుల్లోనూ కంప్యూటర్ సైన్స్, ఈఈఈ, ఈసీఈ, మెకానికల్, సివిల్, కెమికల్ ఇంజనీరింగ్ పాఠాలతోపాటు సైన్స్ సబ్జెక్టుల తరగతులు నిర్వహిస్తున్నారు. తరగతుల వారీగా నిర్వహించబోయే పాఠాలు, టైంటేబుల్, ప్రోగ్రామ్‌లు తదితర వివరాలపై సంబంధిత విభాగాధిపతులు ప్రణాళికలు రూపొందిస్తారు. వాటిని తరగతుల నోటీసు బోర్డుల్లో ప్రదర్శించడం ద్వారా విద్యార్థులకు సమాచారమందుతుంది. సమాచారానికి బదులుగా పిచ్చిరాతలు, గీతలు దర్శనమిస్తున్నా విభాగాధిపతులు మాత్రం చోద్యం చూస్తున్నారని కళాశాల వర్గాలు మండిపడుతున్నాయి. కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్ల నుంచి సీనియర్ ప్రొఫెసర్ల వరకు నిత్యం తరగతులకు వెళ్తున్నారు. ఒక్కో విభాగంలో 15నుంచి 20మంది వరకు పాఠాలు చెబుతున్నారు. ఆ వివరాలను నోటీసు బోర్డులో ప్రదర్శించారా? లేదా? అని వారు చూడటంలేదు. రోజూ వారువెళ్లే తరగతుల గదుల గోడలకు ఉన్న నోటీసు బోర్డుల్లో లవ్‌సింబల్స్, కీప్‌హాట్, సెప్టిక్ ట్యాంక్ నిండిందా.. వంటి పిచ్చి రాతలు. దేవర, పుష్ప, గేమ్‌చేంజర్ చిత్రసినిమాల పేర్లు. పిచ్చిగీతలు రాస్తున్నా వారెందుకు పట్టించుకోవడలేదని విద్యార్థుల తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు.



పిచ్చిరాతలపైనే అతికించిన టైంటేబుల్ అతికించిన దృశ్యం



213 గది వద్ద లవ్‌సింబల్స్, పిచ్చిరాతలు, కొట్టివేతలు

సమాచారాన్ని ప్రదర్శించాలి

ప్రతి తరగతి గదికి నోటీసు బోర్డులను ఏర్పాటుచేయించాం. టైంటేబుల్స్, మార్క్స్, అటెండెంట్స్, ఈవెంట్స్ వివరాలతోపాటు గేట్, క్యాట్ వంటి ఎగ్జామ్స్ సమాచారాన్ని వాటిలో ప్రదర్శించాలి. క్రమం తప్పకుండా నోటీసులు ప్రదర్శించాలని సంబంధిత విభాగాధిపతులకు ఆదేశాలిచ్చాం. ఆ మేరకు పాటించకపోతే చర్యలు తీసుకుంటాం. - ప్రొఫెసర్ చెన్నారెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్

దళిత కాలనీల్లో సమస్యలను పరిష్కరించాలి

- ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

అనంతపురం కల్చరల్, జనవరి 29(ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా దళిత కాలనీల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణమూర్తి డిమాండ్ చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో బుధవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్‌లో ఏఓ అలెగ్జాండర్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కృష్ణమూర్తి మాట్లాడుతూ... జిల్లాలో తొమ్మిది మండలాలు, 34 గ్రామాల్లో వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో సామాజిక సర్వే నిర్వహించామన్నారు. ఈ సందర్భంగా కాలనీల్లో అనేక సమస్యలు తమ దృష్టికి వచ్చాయన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు సూరి, ఉపాధ్యక్షులు సోమశేఖర్, పెద్దయ్య, నాగభూషణం, సహాయ కార్యదర్శి బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

108 ఉద్యోగుల జిల్లా కమిటీ ఎన్నిక

అనంతపురం టౌన్, జనవరి 29(ఆంధ్రజ్యోతి): జిల్లాలో 108 ఉద్యోగుల నూతన కమిటీని ఎన్నుకున్నారు. స్థానిక గణేనాయక్‌భవన్‌లో బుధవారం 108 ఉద్యోగుల సమావేశం నిర్వహించారు. రాష్ట్ర అధ్యక్షుడు కిరణ్‌కుమార్, రాష్ట్ర ప్రధానకార్యదర్శి నరసింహారావు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వారి ఆధ్వర్యంలో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా నాగేంద్ర, ప్రధానకార్యదర్శిగా జయరాజ్, కోశాధికారిగా నాగ భూషణం, రాష్ట్ర కమిటీ మెంబరుగా మారుతి, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా సుంక న్న, జిల్లా ఉపాధ్యక్షులుగా రాము, వన్నూరుస్వామి, సహాయ కార్యదర్శులుగా సుధాకర రెడ్డి, మహేష్, కొండయ్య, మహిళా కన్వీనర్‌గా రాజేశ్వరిని ఎన్ను కున్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షురాలు నాగమణి, మహిళా శ్రామిక కన్వీనరు రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

వాహనాలు నడిపేటప్పుడు జాగ్రత్తలు పాటించాలి: ఎంవీఐ

అనంతపురం రూరల్/ అర్బన్, జనవరి 29(ఆంధ్రజ్యోతి): డ్రైవర్లు వాహనాలు నడిపేటప్పుడు జాగ్రత్తలు పాటించాలని మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు సూచించారు. మండలపరిధిలోని పీవీకేకే కళాశాలలో బుధవారం కళాశాల వాహనాల డ్రైవర్లకు ఎంవీఐ ఆధ్వర్యంలో డ్రైవింగ్‌పై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల యాజమాన్య ప్రతినిధి శ్రీకాంత్‌రెడ్డి, ప్రిన్సిపాల్ బండి రమేష్‌బాబు, బాలాజీ విద్యాసంస్థల ట్రాన్స్‌పోర్టు ఇన్‌చార్జ్ కొండారెడ్డి, ఏఓ మనోహర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా బుధవారం స్థానిక ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన ఎంవీఐ రోడ్డు భద్రత నిబంధనలపై వివరించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజాసమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలి: ఆర్డీఓ

రామగిరి, జనవరి 29(ఆంధ్రజ్యోతి): ప్రజాసమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేయాలని ధర్మవరం ఆర్డీఓ మహేశ్ ఆదేశించారు. బుధవారం రామగిరి తహసీల్దార్ కార్యాలయాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను, కార్యాలయాన్ని పరిశీలించారు. అనంతరం ఆయన మండలంలోని పేరూరు పైలెట్ రీ సర్వే విలేజ్‌గా ఎంపికవడంతో ఆ గ్రామానికి వెళ్లి పరిశీలించారు. క్షేత్రస్థాయిలో జరుగుతున్న సర్వే పనులను పరిశీలించారు. రీ సర్వేలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి తెలియజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ జమానుల్లాఖాన్, డీటీ నరేశ్, సిబ్బంది పాల్గొన్నారు.

ఖాతాదారులకు మరింత మెరుగైన సేవలు

- కెనరా బ్యాంకు జనరల్ మేనేజర్

అనంతపురం క్లాక్‌టవర్, జనవరి 29(ఆంధ్రజ్యోతి): కెనరాబ్యాంకు ఖాతాదారులకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు ప్రణాళికబద్ధంగా ముందుకు సాగుతున్నట్లు ఆ బ్యాంకు జనరల్ మేనేజర్ పాండురంగ మిథంతాయ తెలిపారు. స్థానిక అలెగ్జాండర్‌హాల్‌లో బుధవారం కెనరాబ్యాంకు రీజనల్ కార్యాలయం ఆధ్వర్యంలో క్రీసెట్ ఖాతాదారులు, మేనేజర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కెనరాబ్యాంకు జనరల్ మేనేజర్ పాండురంగ మిథంతాయ మాట్లాడారు. ఉత్తమ ఖాతాదారులను సన్మానించారు. కెనరా బ్యాంకు ఆర్‌ఎం లారెన్స్, సీనియర్ మేనేజర్లు, ఖాతాదారులు పాల్గొన్నారు.

సీనియర్ సివిల్ కోర్టు న్యాయాధికారికి ఉద్యోగోన్నతి

అనంతపురం క్రైం, జనవరి 29(ఆంధ్రజ్యోతి): జిల్లా సీనియర్ సివిల్ కోర్టు న్యాయాధికారి శంకర్‌రావుకు పదోన్నతి లభించింది. న్యాయాధికారి శంకర్‌రావుకు పదోన్నతి కల్పిస్తూ తూర్పుగోదావరి జిల్లా రామచంద్రాపురం కోర్టు అదనపు జిల్లా న్యాయాధికారిగా నియమించారు. ఈ మేరకు బుధవారం ఉత్తర్వులు వెలువడ్డాయి.

జిల్లాలో శాంతిభద్రతలు క్షీణించాయి: అనంత

అనంతపురం క్రైం, జనవరి 29(ఆంధ్రజ్యోతి): జిల్లాలో శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించాయని వైసీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి అన్నారు. వైసీపీ జిల్లా కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజాప్రతి నిధులుగా పనిచేసిన వారు నియోజకవర్గానికి పోతానంటే పోనీయ రని, ఎవరైనా ఫిర్యాదు చేయడానికి వెళితే రివర్స్ కేసులు పెడతారని, పోలీస్‌స్టేషన్లలోనే కొడుతారన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఈ పరిస్థితి ఏర్పడిందన్నారు. మీడియాలో కథనాలు వస్తే రైలు పట్టాలపై పడుకోబెడతామని బహిరంగంగా వార్నింగ్ ఇచ్చినా ఏమీ చేయలేని పరిస్థితిలో ఉన్నారన్నారు. జిల్లా కేంద్రంలో కానిస్టేబుళ్లే ప్రజలపై దాడులు చేస్తున్నారన్నారు. గుంతకల్లు మండలంలోని చింతలాంపల్లిలో జరిగిన ఘటనపై బాధితుడు ఫిర్యాదు చేయడానికి వెళ్తే పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్ కిశోర్, జాఫర్ బాధితుడి దుస్తులు తొలగించి డ్రాయర్‌పై నిలబెట్టి ఇష్టారాజ్యంగా కొట్టారన్నారు. పోలీసులకు అధికారపార్టీ నేతలపై అంత మోజుంటే ఖాకీ బట్టలు తీసేసి పచ్చచొక్కాలు వేసుకోవాలన్నారు. 'పరిస్థితి ఇలాగే ఉంటే మీ కార్యాలయాల వద్దకే వచ్చి మీ బాధ్యతను గుర్తు చేస్తాం' అని స్పష్టం చేశారు.

'గుమ్మనూరు' వ్యాఖ్యలు క్షమించరానివి : సీపీఐ

అనంతపురం విద్య, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): పాత్రికేయులపై ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం చేసిన వ్యాఖ్యలు క్షమించరానివని, ఆయన క్షమాపణ చెప్పాలని సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్ బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. పాత్రికేయులను రైలు పట్టాలపై పండపెట్టేందుకు వెనకాడనని చెప్పడం దారుణం అన్నారు. ఇది పత్రికాస్వేచ్ఛను అణగదొక్కే ప్రయత్నాలని ఆయన పేర్కొన్నారు. పాత్రికేయులకు తక్షణమే గుమ్మనూరు క్షమాపణ చెప్పాలన్నారు.

ఖండించిన ఏఐఎస్‌బీ: ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం మీడియాపై చేసిన వ్యాఖ్యలు సరికాదని ఏఐఎస్‌బీ జిల్లా కార్యదర్శి పాపిరెడ్డిపల్లి పృథ్వీ, ఇతర నాయకులు బుధవారం ఒక ప్రకటనలో ఖండించారు. ఆయన తక్షణమే వాటిని వెనక్కు తీసుకోవాలన్నారు.

'లక్ష డప్పులు-వేల గొంతుల'కు తరలిరండి

అనంతపురం రూరల్, జనవరి29(ఆంధ్రజ్యోతి): హలో మాదిగ, మాదిగ ఉపకులాల లక్ష డప్పులు..వేల గొంతుల కార్యక్రమానికి ఉమ్మడి జిల్లాలోని మాదిగలు పెద్ద ఎత్తున తరలిరావాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు బీసీఆర్ దాస్ పిలుపునిచ్చారు. ఆ మేరకు బుధవారం మండలంలోని రాచానపల్లి, సిండికేట్ నగర్, ధర్మబిక్షం కాలనీలో డబ్బు కొడుతూ ఆయన ప్రచారం చేశారు. ఎమ్మార్పీఎస్ జాతీయ వ్యవస్థాపకులు మందకృష్ణ మాదిగ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 6న చలో హైదరబాదు కార్యక్రమం తలపెట్టిన విషయం తెలిసిందేనన్నారు. ఎస్సీ వర్గీకరణకు తెలంగాణ ప్రభుత్వంపై ఒత్తిడి తేవడం తదితర డిమాండ్లతో కార్యక్రమాన్ని తలపెట్టారన్నారు. ఉమ్మడిజిల్లాలోని మాదిగలు, డప్పు కళాకారులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని కోరారు.

'జగన్ ఏపీని అప్పుల ఊబిలోకి నెట్టేశాడు'

అనంతపురం అర్బన్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఏపీని అప్పుల ఊబిలో నెట్టేశాడని టీడీపీ నాయకులు సిమెంట్ పోలన్న మండిపడ్డారు. ఈ మేరకు బుధవారం ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గత ఐదేళ్లల్లో జగన్ ప్రభుత్వం రూ.10 లక్షల కోట్లు అప్పులు చేయగా, రూ.లక్షా 40 వేల కోట్ల మేర బకాయిలు పెట్టిందన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత ఏపీని అభివృద్ధి వైపు నడిపించేందుకు సీఎం చంద్రబాబు, మంత్రి నారాలోకేశ్ ప్రత్యేక కృషి చేస్తున్నారన్నారు.

చదువులకు పంపితే.. శవాలను అప్పగిస్తున్నారు

- ఐక్య విద్యార్థి సంఘాల నాయకుల మండిపాటు
- సోములదొడ్డిలోని నారాయణ కళాశాల ముట్టడికి యత్నం


కళాశాల ముట్టడికి ర్యాలీగా వెళ్తున్న విద్యార్థి సంఘాల నేతలు

అనంతపురం రూరల్, జనవరి 29(ఆంధ్రజ్యోతి): విద్యార్థులను చదువ కోసం పంపితే, వారి శవాలను తల్లిదండ్రులకు అప్పగిస్తున్నారని నారాయణ కళాశాల యాజమాన్యంపై ఐక్య విద్యార్థి సంఘాల నాయకులు మండిపడ్డారు. మండలంలోని సోములదొడ్డి గ్రామ సమీపంలోని నారాయణ జూనియర్ కళాశాల ముట్టడి కార్యక్రమాన్ని బుధవారం ఐక్య విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో చేపట్టారు. గ్రామ సమీపంలోని హనుమాన్ సర్కిల్ నుంచి కళాశాల వరకు ర్యాలీ చేపట్టారు. అనంతరం విద్యార్థి సంఘాల నాయకు లు కళాశాల ముట్టడికి యత్నించగా, వారిని పోలీసులు అడ్డుకున్నారు. ఈ క్రమంలో పోలీసులు, విద్యార్థి సంఘాల నాయకుల మధ్య తోపులాట జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థి సంఘాల నేతలు మాట్లాడుతూ... రాష్ట్రవ్యాప్తంగా నారాయణ విద్యాసంస్థలలో మంచి విద్యను అందిస్తారని లక్షల రూపాయల ఫీజులు కట్టి పిల్లలను చేర్పిస్తున్నారని అన్నారు. విద్యాసంస్థల మాజయాన్యం మాత్రం విద్యార్థులను ప్రయోజకులను చేయకుండా, వారి చావుకు కారకులుగా మారుతున్నార అన్నారు. స్థానిక కళాశాలలో ఐదు రోజుల కిందట ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థి కళాశాల భవనం నుంచి దూకి మరణిస్తే.. పోలీస్ యంత్రాంగం కళాశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోలేదన్నారు. ఉమ్మడి జిల్లాలో ముగ్గురు మంత్రులు ఉండికూడా విద్యార్థి మృతిపై స్పందించకపోవడం బాధాకరమన్నారు. జిల్లాలోని ఆర్ఐఓ విద్యాసంస్థలు ఇస్తున్న కాసులకు కక్కుర్తి పడి కళాశాలల యాజమాన్యానికి వత్తాసు పలుకుతున్నారన్నారు. సంఘటన గురించి ఇంత వరకు ప్రభుత్వానికి నివేదిక ఇవ్వలేదన్నారు. రూరల్ డీఎస్పీ వెంకటేశ్వర్లుకు ఫిర్యాదు చేసి గాలికొదిలేశారన్నారు. నారాయణ విద్యాసంస్థల యాజమాన్యంపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలన్నారు. లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ప్రసన్న, ఏఐఎస్‌బీ రాష్ట్ర సహాయకార్యదర్శి రాజేంద్ర, వైఎస్సార్ విద్యార్థి విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రవిచంద్ర, ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కుళ్లాయిస్వామి, ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి పరమేష్, ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర కార్యదర్శి నరేష్, ఎస్ఐఎస్‌బీ జిల్లా ప్రధాన కార్యదర్శి పృథ్వీ, వైఎస్సార్ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్ యాదవ్, పీఎస్ఐవీ కార్యదర్శి వినోద్ కుమార్, సిద్ధు, హనుమంతురాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పురందర దాస ఆరాధనోత్సవాలు


పురందర దాసకు ప్రత్యేక పూజలు నిర్వహించిన దృశ్యం

అనంతపురం అర్బన్, జనవరి 29(ఆంధ్రజ్యోతి): నగరంలోని మొదటి రోడ్డులో వెలసిన రాఘవేంద్రస్వామిమఠంలో గురు పురందర దాస ఆరాధన మహోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా బుధవారం ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. ఓం సంగీత నృత్య కోలాట శిక్షణా సంస్థ అధ్యక్షురాలు డాక్టర్ దేవరకొండ కౌసల్య ఆధ్వర్యంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

పేకాట డీఆర్వోపై చర్యలు తీసుకోరెందుకు?

- ఎస్సీ, ఎస్టీ సంఘాల నాయకుల ఆందోళన

అనంతపురం సెంట్రల్/టౌన్, జనవరి 29(ఆంధ్రజ్యోతి): ఎస్సీ కమిషన్, ఇద్దరు కలెక్టర్లు ఉన్న వేదికపైనే తన ఫోన్‌లో ఆన్‌లైన్ రమ్మీ ఆడిన డీఆర్వో మలోలపై చర్యలెందుకు తీసుకోవడంలేదని ఎస్సీ, ఎస్టీ సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సాకేహరి ప్రశ్నించారు. డీఆర్వో మలోలను సస్పెండ్‌చేసి అట్రాసిటి కేసు నమోదుచేయాలని బుధవారం దళిత సంఘాల ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద నిరసన వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా సాకేహరి మాట్లాడుతూ ఎస్సీల మనోభావాలు దెబ్బతీసేలా వ్యవహరించిన మలోలపై అట్రాసిటీ కేసునమోదు చేసి విధులనుంచి తొలగించాలని ప్రజల్లో చర్చజరుగుతోందన్నారు. అయినా పదిరోజులు గడిచినా చర్యలెందుకు తీసుకోవడంలేదని ప్రశ్నించారు. అనంతరం జాయింట్ కలెక్టర్ శివనారాయణశర్మకు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. నాయకులు రామకృష్ణ, శ్రీనివాసులు, దొనతిమ్మప్ప, గోపాల్, గోవిందు, ఆది, వెంకటేశు, కుళ్లాయప్ప, శ్రీనివాస్, వెంకటరమణ, రమేష్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల పట్ల కుల వివక్షా?

అనంతపురం సెంట్రల్, జనవరి 29(ఆంధ్రజ్యోతి): సమానత్వాన్ని పాటించాల్సిన జిల్లా విద్యాశాఖాధికారి ఉపాధ్యాయుల పట్ల కుల వివక్ష చూపడమేంటని దళిత సంఘాలు ప్రశ్నించాయి. కుల వివక్ష చూపుతున్న డీఈఓపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలంటూ దళిత సంఘాల నాయకులు బుధవారం స్థానిక ఆర్అండ్‌బీ అతిథిగృహంలో సమావేశాన్ని నిర్వ హించారు. ముఖ్య అతిథులుగా హాజరైన యల్లన్న, చిరంజీవి, రామతీర్థం మాట్లాడారు. గత వైసీపీ ప్రభుత్వం దళిత వర్గాలకు చెందిన ఉపాధ్యాయులపై కక్షపూరిత సాధింపులకు పాల్పడిందని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వంలోనూ అధికారుల తీరుమారడంలేదని వాపోయారు. ఫిజికల్ సైన్స్ స్కూల్ అసిస్టెంట్ పోస్టుకు అర్హత, అనుభవమున్న మహిళా ఉపాధ్యా యురాలు మహేశ్వరికి ఆర్నెల్లుగా ఉద్యోగోన్నతి ఇవ్వకపోవడం ఇందుకు నిదర్శనమన్నారు. ఉపాధ్యాయురాలికి న్యాయం చేయాలని డిమాండ్‌చేశారు.

సమస్యలపై చర్చించని సమావేశం


సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ బండారు ఈరమ్మ

గార్లదిన్నె, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): సమస్యలపై చర్చించకుండానే మండల సర్వసభ్య సమావేశాన్ని ముగించారు. మండల పరిధిలోని స్థానిక ప్రజాప్రతినిధులు గ్రామాల్లో నెలకొన్న సమస్యలను గుర్తించి వాటి పరిష్కారం కోసం ప్రతి మూడు నెలలకోసారి సర్వసభ్య సమావేశం నిర్వహిస్తారు. అయితే స్థానిక మండలపరిషత్ కార్యాలయంలో బుధవారం ఎంపీపీ వెంకటనారాయణ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఏ ఒక్క ప్రజాప్రతినిధి కూడా తమ గ్రామ సమస్యలపై మాట్లాడలేదు. కో ఆప్షన్ సభ్యులు యూనీష్ మాత్రమే సమస్యను లేవనెత్తాడు. కల్లూరులో విద్యుత్ సమస్యను విద్యుత్‌శాఖ ఏఈ విజయ్ కుమార్‌ను దృష్టికి తీసుకెళ్లాడు. దీంతో వేసవిలో తాగునీటి సమస్య తలెత్తుందన్నారు. కేవలం అధికారులు తమ శాఖలు అమలు చేసే పథకాలపై ప్రసంగించారు. తహసీల్దార్ బండారు ఈరమ్మ, ఏఓ బాబా ఫకృద్దీన్, ఈఓఆర్డీ దామోదరమ్మ, ఎంఈఓ మల్లికార్జున నాయక్, వ్యవసాయాధికారి సోమశేఖర్, ఏపీఓ మల్లికార్జున, పీఆర్ జేఈ శ్రీనివాస్ రావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ లక్ష్మణ్, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

పాఠశాలలను దెబ్బతీస్తే.. ఉద్యమిస్తాం

- ఏపీటీఎఫ్ నాయకుల హెచ్చరిక

అనంతపురం విద్య, జనవరి 29(ఆంధ్రజ్యోతి): జీఓ 117 రద్దు నేపథ్యంలో ఇచ్చిన ప్రత్యామ్నాయ ఉత్తర్వులతో పాఠశాలలను నిర్వీర్యం చేస్తే సహించేది లేదని, ప్రభుత్వ విధానాలపై ఉద్యమిస్తా మని ఏపీటీఎఫ్ నాయకులు హెచ్చరించారు. ఆ సంఘం నాయకులు బుధవారం స్థానిక ఉపాధ్యాయభవన్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకటేష్, ప్రధాన కార్యదర్శి సిరాజుద్దీన్, రాష్ట్ర పూర్వపు కార్యదర్శి నరసింహులు మాట్లాడుతూ....గత ప్రభుత్వం విద్యారంగాన్ని విచ్ఛిన్నం చేసేలా జీఓ 117 తీసుకొచ్చి, వేలాది స్కూళ్లు మూతపడేలా చేసిందన్నారు. ప్రస్తుతం ప్రభుత్వం మెమో పేరుతో అంతకన్నా నష్టం వచ్చేలా ప్రత్యామ్నాయ విధానాలతో గందరగోళం సృష్టిస్తోందన్నారు. సుదూర ప్రాంతాల్లోని గ్రామీణ పాఠశాలల్లోని 3,4,5 తరగతులు చదివే విద్యార్థులు మోడల్ ప్రాథమిక పాఠశాలలకు వెళ్లలేక వేలాదిగా డ్రాప్ అవుట్‌లుగా మారే ప్రమాదం ఉందన్నారు. కావున 3,4,5 తరగతులను యథావిధిగా ప్రాథమిక పాఠశాలల్లో విలీనం చేసి పూర్వపు స్థితిని తీసుకురావాలని కోరారు. ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు సతీష్‌కుమార్, నరేష్‌కుమార్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సరాజిఖీర్‌వలి, జిల్లా రాష్ట్ర కౌన్సిలర్ వెంకటరమణ, ఆడిట్ కన్వీనర్ వన్నప్ప, నాయకులు రామ్మూర్తి, హనుమంతు, హిమగిరి ప్రసాద్, ఫక్రుద్దీన్, నస్రుల్లా, రజాక్ తదితరులు పాల్గొన్నారు.

కాలేజీల్లో ఆత్మహత్యలపై నిరాహార దీక్ష



నిరాహార దీక్షలకు దిగిన విద్యార్థి సంఘాల నాయకులు

అనంతపురం విద్య, జనవరి 29(ఆంధ్రజ్యోతి): కార్పొరేట్ కాలేజీల్లో జరుగుతున్న విద్యార్థుల ఆత్మహత్యలపై కలెక్టర్ చర్యలు తీసుకోవాలని పలు విద్యార్థి సంఘాల నేతలు నిరాహార దీక్షకు దిగారు. బుధవారం పీఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ప్రతిభా భారతి, ఏఐఎస్పీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నరసింహ, ఏఐఎస్ఓ రాష్ట్ర కన్వీనర్ నిరంజన్‌యాదవ్, ఇతర సంఘాల నేతలు కలెక్టరేట్ వద్ద నిరాహార దీక్షలకు దిగారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... నారాయణ కాలేజ్‌లో విద్యార్థి ఆత్మహత్య చేసుకుని వారం గడిచినా.. అధికారులు నిద్రమత్తు వీడటం లేదన్నారు. కార్పొరేట్ కళాశాలల విషయంలో ఆర్ఐఓ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. ఆయనను కలెక్టర్ వెంటనే సస్పెండ్ చేయాలన్నారు. అదేవిధంగా బాధిత కుటుంబానికి నష్టపరిహారం ప్రకటించాలన్నారు. ఈ సమస్యలు పరిష్కారమయ్యే వరకూ నిరాహారదీక్షలు కొనసాగిస్తామన్నారు. కార్యక్రమంలో ఎస్సీఎస్టీ, బీసీ మైనార్టీ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు గోగుల మూర్తి, ఇతర నాయకులు మౌనిక, పార్వతి, దివ్య, గంగాధర్, ఆదర్శ్, హేమనాథ్, విక్రమ్, బన్నీ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

టీడీపీలో చేరిన వైసీపీ నాయకులు



పయ్యావుల శ్రీనివాసులు సమక్షంలో టీడీపీలో చేరిన వైసీపీ నాయకులు

ఉరవకొండ, జనవరి 29(ఆంధ్రజ్యోతి): వైసీపీకి గట్టి ఎదురు దెబ్బ తగిలింది. ఉరవకొండకు చెందిన వైసీపీ మండల కో ఆప్షన్ సభ్యుడితో పాటు పలువురు మైనార్టీ నాయకులు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. అనంతపురంలో బుధవారం టీడీపీ నాయకులు పయ్యావుల శ్రీనివాసులు సమక్షంలో వైసీపీ మండల కో ఆప్షన్ సభ్యుడు పామిడి సలీం, మైనార్టీ నాయకులు బాషా, సద్దామ్ నిజాం, తయ్యుబ్, యూనూస్, నూర్, అన్వర్, యూసఫ్, షాకీర్ టీడీపీ పార్టీలోకి చేరారు. వారికి ఆయన కండువాలు వేసి పార్టీలోకి స్వాగతం పలికారు. సీఎం చంద్రబాబు, ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ చేస్తున్న అభివృద్ధి చూసి పార్టీలోకి చేరినట్లు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు రహంతుల్లా, ఖలందర్ పాల్గొన్నారు.

నేడు ఉరవకొండకు మంత్రి రాక

ఉరవకొండ,జనవరి29(ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణంలో రైతులకు డ్రిప్, స్ప్రింక్లర్లు పంపిణీ చేసే కార్యక్రమంలో ఆర్థిక శాఖమంత్రి పయ్యావుల కేశవ్ గురువారం పాల్గొననున్నారు. నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో 290 మంది రైతులకు రాయితీపై డ్రిప్, స్ప్రింక్లర్లు పంపిణీ చేయనున్నారు. మంత్రి పర్యటన ఏర్పాట్లను ఏపీ ఎంఐపీ ఏడీ ఫిరోజ్‌ఖాన్ పరిశీలించారు. రాగులపాడు లిఫ్ట్ ఇరిగేషన్ నుంచి హంద్రీనీవా కాలువ వెడల్పు పనులను మంత్రి పరిశీలించనున్నారు.

'మన ఊరు.. మన ఎమ్మెల్యే'ను జయప్రదం చేయండి

గుత్తి,జనవరి29(ఆంధ్రజ్యోతి): మున్సిపల్, గ్రామీణ ప్రాంతాల్లో ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఫిబ్రవరి మొదటి వారం నుంచి 'మన ఊరు మన ఎమ్మెల్యే' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని టీడీపీ నాయకులు గుమ్మనూరు నారాయణ, ఎంకే చౌదరి పేర్కొన్నారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో బుధవారం వారు విలేకరులతో మాట్లాడుతూ.. పట్టణ, రూరల్ ప్రాంతాల్లో నెలకొన్న ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. సమావేశంలో నాయకులు ప్రతాప్, రమేష్, రవి, శీన, సోమశేఖర్, సంపత్‌కుమార్ పాల్గొన్నారు.

సంత్ సేవాలాల్ ఉత్సవాలపై సమీక్ష

గుత్తిరూరల్, జనవరి29(ఆంధ్రజ్యోతి): మండలంలోని సేవాఘడ్ వద్ద సంత్ సేవాలాల్ మహారాజ్ ఆలయంలో స్వామి వారి 286వ జయంతి ఉత్సవాలపై ఆర్డీఓ శ్రీనివాసులు డీటీడబ్ల్యూఓ రామాంజనేయులు బుధవారం అన్ని శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఫిబ్రవరి 13 నుంచి 15 వరకు జరిగే జయంతి ఉత్సవాలకు హాజరయ్యే భక్తులకు ఎలాంటి సమస్యలు రాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో గుంతకల్లు డీఎస్పీ శ్రీనివాసులు, తహసీల్దారు ఓబులేసు, ఎంపీడీఓ ప్రభాకర్ నాయక్ పాల్గొన్నారు.

సాదాసీదాగా మండల సమావేశం

ఉరవకొండ,జనవరి29(ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ కార్యాలయ సమావేశ భవనంలో బుధవారం నిర్వహించిన మండల సర్వసభ్యసమావేశం సాదాసీదాగా జరిగింది. ఎంపీపీ నరసింహులు అధ్యక్షతన సమావేశాన్ని నిర్వహించారు. పలు అంశాలపై సభ్యులు అధికారుల దృష్టికి తీసుకు వచ్చారు. సమావేశంలో ఎంపీడీవో రవిప్రసాద్, తహసీల్దారు మహబూబ్ బాషా, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

న్యాయం చేయాలని బాధితుల ఆందోళన

ఉరవకొండ, జనవరి 29(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అర్బన్ పోలీస్‌స్టేషన్ ఎదుట న్యాయం చేయాలంటూ బాధితులు ఆందోళన చేపట్టారు. అనంతపురం- గుంతకల్లు రహదారిపై బైఠాయించి నిరసన తెలిపారు. చిన్నముష్టూరు సమీపంలో మంగళవారం ఐచర్ వాహనం ఢీకొని సుభద్రమ్మ మృతి చెందింది. వాహనం డ్రైవర్‌ను అరెస్ట్ చేయకుండా జాప్యం చేస్తున్నారని పోలీసులపై బాధితులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

నేడు కన్యకా పరమేశ్వరికి పట్టువస్త్రాలు

గుంతకల్లుటౌన్,జనవరి29(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవం సందర్భంగా శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం పట్టు వస్త్రాలను అందజేస్తారని ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు గోపాజగదీష్ బుధవారం ఒక ప్రకటనతో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవాన్ని అధికారకంగా నిర్వహించాలని ఉత్తర్వులు ఇచ్చారన్నారు.

● డీ.హీరేహాళ్ : వాసవి మాత ఆత్మార్పణ దినోత్సవాన్ని అధికారికంగా ప్రకటించిన కూటమి ప్రభుత్వానికి రాష్ట్ర ఆర్య వైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ నాగళ్లి వెంకటేశప్ప కృతజ్ఞతలు తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఆర్య వైశ్యుల ఇలవేల్పు వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించేందుకు జీఓ ఇవ్వడం హర్షణీయమన్నారు. సీఎం చంద్రబాబుకు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌కు, మంత్రి లోకేష్‌కు ధన్యవాదాలు తెలిపారు.

పరిశుభ్రతను పాటించాలి

బొమ్మనహాళ్, జనవరి 29(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ పరిసర ప్రాంతాల్లో పరిశుభ్రతను పాటించాలని ఎంపీడీఓ విజయభాస్కర్, ఈఓపీఆర్డీ దాస్, ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సీడీపీఓ లక్ష్మీప్రసన్న పేర్కొన్నారు. మండలంలోని బొల్లనగుడ్డం గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రం చుట్టూ కొందరు స్థానికులు మూత్రం, మలవిసర్జన చేస్తూ అపరిశుభ్రత చేస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు గీత, శాంతమ్మ, సర్పంచ్ గాదిలింగ, మాజీ ఎంపీటీసీ గోపాల్ పాల్గొన్నారు.

ఇంజనీరింగ్ అధికారులపై చర్యలు తీసుకోవాలి

గుంతకల్లు టౌన్, జనవరి 29(ఆంధ్రజ్యోతి): కార్మికులను వేధిస్తున్న ఇంజనీరింగ్ అధికారులపై చర్యలు తీసుకోవాలని ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బి. సురేష్ డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద కార్మికులతో ఐఎఫ్‌టీయూ నాయకులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్ఎస్ ట్యాంక్ దగ్గర తీసిపారేసిన స్క్రాప్ వస్తువులు కనబడలేదని గత వారం రోజులుగా 15మంది మున్సిపల్ కార్మికులను మున్సిపల్ ఏఈ మానసికంగా వేధిస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ నాయకులు రామాంజనేయులు, జిలాన్ పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

తాడిపత్రి, జనవరి 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని చుక్కలూరు గ్రామానికి చెందిన నారాయణమ్మ (55) చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందిందని రూరల్ పోలీసులు తెలిపారు. ఈనెల 26న ఉదయం వాకింగ్ చేస్తున్న నారాయణమ్మ ను ద్విచక్రవాహనం ఢీకొనడంతో గాయాలపాలైంది. అనంతపురంలో చికిత్స పొందుతూ మృతిచెందిందని పోలీసులు తెలిపారు. మృతురాలికి ముగ్గురు కొడుకులు, ఒక కుమార్తె ఉన్నారు.

8 తరగతులు.. 4 గదులు..!

● ఇరుకు గదుల్లో 224 మంది విద్యార్థులకు పాఠాలు ● నిలిచిపోయిన భవన నిర్మాణం



వరండాలో 4, 5 తరగతులు.. 3 వతరగతిలో బెంచీలపై కొందరు, నేలపై కొందరు.. అర్థంతరంగా ఆగిన భవనం

కూడేరు, జనవరి 29(ఆంధ్రజ్యోతి): పేరుకే జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల.. విద్యార్థులు కూర్చోవడానికి కనీసం తరగతి గదులు కూడా లేవు. దీంతో కొందరు విద్యార్థులు బెంచీలపై మరికొందరు నేలపై ఇరుక్కుని కూర్చుంటుండగా, కొన్ని తరగతులను వరండాలో నిర్వహిస్తున్నారు. ఇదీ కూడేరు మండలం కొర్రకోడు జడ్పీ ఉన్నత పాఠశాల దుస్థితి. ఈ పాఠశాలలో మొత్తం 8 తరగతులకు 224 మంది విద్యార్థులు ఉన్నారు. వీరందరికీ నాలుగు గదులే ఉన్నాయి. గత వైసీపీ పాలనలో 1, 2 తరగతులను వేరు చేసి 3,4,5 తరగతులను జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లోకి విలీనం చేశారు. దీంతో 3 నుంచి 10వ తరగతి వరకు 224 మంది విద్యార్థులు ఉన్నారు. పాఠశాల్లో 3, 6, 9, 10 తరగతుల్లో ఒక్కొక్క గదుల్లో 30 నుంచి 42 మంది వరకు ఒకరిపై ఒకరు పడి ఇరుకిరుకుగా కూర్చుంటున్నారు. 4, 5 తరగతి విద్యార్థులు వరండాల్లో కూర్చుంటున్నారు. 7వ తరగతి విద్యార్థులు చీకట్లో గదిలో ఉంటే, 8వ తరగతి విద్యార్థులు హెచ్ఎం రూమ్‌లోనే అసౌకర్యాల నడుమ కాలం గడుపుతున్నారు. గత ప్రభుత్వంలో పాఠశాల భవనాల నిర్మాణానికి 2022 జూన్ నెలలో నాడు -నేడు 2వ విడత కింద రూ.1.87కోట్లు నిధులు మంజూరు చేశారు. తరగతి గదులు, వంటగది, మరుగుదొడ్లు, కాంపౌండ్‌వాల్, తాగునీరు తదితర పనులు చేయడానికి నిధులు కేటాయించారు. అందులో రూ.1.02 కోట్లు ఖర్చు చేసి కొంత వరకు పనులు చేశారు. నిధులు విడుదల కాలేదని తర్వాత పనులను అర్థంతరంగా వదిలేశారు.

మంత్రి చొరవ చూపాలి



గదులు లేక విద్యార్థులు ఒకరిపై ఒకరు కూర్చొంటున్నారు. ప్రాథమిక, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు రెండు ఒకే ప్రదేశంలో ఉండడంతో గదుల కొరత తీవ్రంగా ఉంది. పిల్లలు సాయంత్రానికి నడుంనొప్పులతో బాధ పడుతున్నారు. భవనాలు పూర్తి కాకపోవడంతో విద్యార్థులకు కష్టాలు తప్పలేదు. ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ చొరవ చూపి నిధులు విడుదల చేయాలి. గ్రామస్థులతో కలిసి త్వరలోనే మంత్రిని కలుస్తాం.

-చంద్రశేఖర్ యాదవ్, సర్పంచ్, కొర్రకోడు

వెంటనే పూర్తి చేయాలి



వైసీపీ పాలనలో అర్థంతరంగా నిలిచిపోయిన పాఠశాల భవనాలను కూటమి ప్రభుత్వం పూర్తి చేయాలి. సరైన సౌకర్యాలు లేక విద్యార్థులు ఇరుకు గదుల్లో చదువుకుంటున్నారు. గత ప్రభుత్వం నిధులు పూర్తిగా విడుదల చేయకపోవడంతో పనులు నిలిచిపోయాయి.

- చిత్రా ఓబుళపతి, విద్యార్థి తండ్రి, కొర్రకోడు

పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తా



సమస్యలతో సతమతమవుతున్న విద్యార్థులకు సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తా. పయ్యావుల సోదరుల సహకారంతో నిలిచిపోయిన పాఠశాల పనులు పూర్తి చేసి విద్యార్థుల భవిష్యత్తుకు భరోసా కల్పిస్తాం. చదువులతోపాటు క్రీడల్లో రాణించడానికి అవసరమైన ఆట స్థలం శుభ్రం చేయిస్తాం. వచ్చే విద్యా సంవత్సరానికి కొత్త భవనంలో చదువులు కొనసాగించడానికి నిధుల తీసుకొస్తాం.

- ఆర్. రామకృష్ణ, పాఠశాల కమిటీ చైర్మన్

జగనన్న కాలనీలో విచారణ ప్రారంభం



ఫిర్యాదులు స్వీకరిస్తున్న అధికారులు, నాయకులు

గుంతకల్లు, జనవరి 29(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని దోనిముక్కల రోడ్డు జగన్న లే-అవుట్లలో స్థలాల విషయంగా రెవెన్యూ అధికారులు విచారణను ప్రారంభించారు. బుధవారం ఉదయం జగనన్న కాలనీలో శిబిరాన్ని ఏర్పాటుచేసి స్థలాల విషయంగా స్థలాలు కబ్జాకు గురైన లబ్ధిదారుల నుంచి ఫిర్యాదుల స్వీకరణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. టీడీపీ నాయకుడు నారాయణ స్వామి మాట్లాడుతూ కాలనీల్లో ఉన్న లబ్ధిదారులందరూ తమ వద్ద ఉన్న స్థలాల పట్టాలను తెచ్చి వెరిఫై చేయించుకోవాలని, అర్హులందరికీ న్యాయం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు బండారు ఆనంద్, ఆమ్లెట్ మస్తాన్ యాదవ్, గుమ్మనూరు నారాయణస్వామి, పాల మల్లికార్జున, ఉడదాల ప్రభాకర్, అంజి, ఫ్రూట్ మస్తాన్, ఫజులు, వీరేశ్, చిప్పగిరి ప్రతాప్, రాయల్ వెంకటేశులు, లక్ష్మినారాయణ, తదితరులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాదాలపై అవగాహన

గుంతకల్లుటౌన్,జనవరి29(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 29వ వార్డులోని ప్రజలకు అగ్నిప్రమాదాలపై బుధవారం అగ్నిమాపక సిబ్బంది అవగాహన కల్పించారు. గ్యాస్ లీకై మంటలు వ్యాపిస్తే ఎలా అర్పాలి, ప్రమాదవశాత్తు ప్రమదాలు జరిగితే ఎలా కాపాడుకోవాలి అనే విషయంపై డెమో ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది అవినాష్, రమేష్, సచివాలయ సెక్రెటరీ ఆదినారాయణ, తదితరులు పాల్గొన్నారు.

వాహనాలను నిర్లక్ష్యంగా నడపొద్దు

రాయదుర్గంరూరల్, జనవరి 29(ఆంధ్రజ్యోతి): వాహనదారులు వాహనాలను నిర్లక్ష్యంగా నడిపి ప్రాణాలు కోల్పోవద్దని ఎంవీఓ విశ్వనాథ్‌రెడ్డి ఆటో డ్రైవర్లకు హెచ్చరించారు. జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల సందర్భంగా బుధవారం ఎంవీఓ కార్యాలయంలో స్కూల్ బస్సులు డ్రైవర్లకు వారి సహాయకులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంవీఐ మాట్లాడుతూ కేవలం డ్రైవర్ల నిర్లక్ష్యం వాహనాలను నడపడం ద్వారానే ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. సరైన సమయంలో స్టీరింగ్ తిప్పకపోవడంతో బస్సు ఎదురుగా ఉన్నా రోడ్డు పక్క గోతిలో పడిపోయిందన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

గుత్తిరూరల్, జనవరి 29(ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొత్తపేట గ్రామాశివారులోని జాతీయ రహదారిపై బుధవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలయ్యాయి. పెద్దవడుగూరు మండలం మిడుతూరు చెందిన పవన్ కుమార్ అనే యువకుడు బైక్‌పై కరిడికొండకు వెళ్తున్నారు. కొత్తపేట శివారులోకి రాగానే బైక్‌ను వెనుక నుంచి కారు ఢీ కొట్టడంతో పవన్‌కుమార్‌కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు గుర్తించి గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

మద్యం దుకాణంలో చోరీ

గుంతకల్లుటౌన్,జనవరి29(ఆంధ్రజ్యోతి): స్థానిక ఆలూరు రోడ్డులోని ఎస్వీ వైన్ షాపులో మంగళవారం రాత్రి చోరీ జరిగింది. రూ.10వేల నగదు, రూ.30వేలు విలువ చేసే మద్యం బాటిళ్లను దుండగులు ఎత్తుకెళ్లారు. వన్‌టౌన్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు మంగళవారం రాత్రి గుర్తుతెలియని దుండగులు వైన్‌షాపు తాళాలు పగలగొట్టి లోపలకి చొరబడ్డారు. ఈ విషయంపై షాపు నిర్వాహకులు వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

అపరిశుభ్రతపై బీజేపీ నాయకుల ఆగ్రహం

కణేకల్లు, జనవరి 29(ఆంధ్రజ్యోతి): మాల్యం గ్రామంలో వీధులు అపరిశుభ్రం ఉండడంపై బీజేపీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ పార్టీ మండల నాయకులు తిప్పేస్వామి ఆధ్వర్యంలో గ్రామంలోని పలు వీధులలో పర్యటించారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ ఫిబ్రవరి 3 నుండి 5వ తేదీ వరకు గ్రామంలో సుంకులమ్మదేవి ఉత్సవాలు ఉండగా అధికారులు గ్రామంలో పరిశుభ్రతను పాటించడంలో పూర్తిగా నిర్లక్ష్యం చేశారని అన్నారు. ప్రధానంగా వీధులన్నీ డ్రైనేజీనీటితో అపరిశుభ్రంగా మారాయి. దీంతోపాటు పాటు దోమలు విపరీతంగా ఉండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు మండిపడ్డారు. అనంతరం సచివాలయ ఉద్యోగికి వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు మల్లయ్యచౌదరి, విజయ్‌కుమార్, చిక్కణ్ణ, రమేష్, క్రాంతికుమార్, సంతోష్, వంద్ర, గురుస్వామి తదితరులు పాల్గొన్నారు.

తాడిపత్రిని పర్యాటకంగా అభివృద్ధి చేయండి

తాడిపత్రి, జనవరి 29(ఆంధ్రజ్యోతి): తాడిపత్రి దేవాలయాలను పర్యాటకంగా అభివృద్ధి చేయాలని స్థానిక బీజేపీ నాయకులు గంగాధర్‌యాదవ్, రామాంజనేయులు తదితరులు కలిసి 20 సూత్రాల అమలు కమిటీ చైర్మన్ లంక దినకర్‌ను కోరారు. జిల్లా పర్యటనకు వచ్చిన ఆయనను అనంతపురంలో కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణంలోని ఆలయాలను పర్యాటక రంగంలో చేర్చి అభివృద్ధి చేయాలని కోరామని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

డి.హీరేహాళ్, జనవరి 29(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని బళ్లారి - బెంగుళూరు హైవేపై జరిగిన రోడ్డు ప్రమాదంలో మండల కేంద్రానికి చెందిన గోవిందరెడ్డి(50) అనే వ్యక్తి మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మండల కేంద్రానికి చెందిన గోవిందరెడ్డి, పంచర్‌షాప్ నిర్వహిస్తుండేవాడు. బుధవారం గ్రామం నుంచి ద్విచక్ర వాహనంపై రాంపురం వైపు వెళుతుండగా జాజరకల్లు గ్రామ సమీపంలో నేషనల్ హైవే నందు ముందుకెళుతున్న బొలెరో వాహనాన్ని వెనుక నుంచి ద్విచక్రవాహనం ఢీ కొనడంతో కిందపడడంతో గాయాలయ్యాయి. చికిత్స కోసం బళ్లారి విమ్స్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ గురుప్రసాద్‌రెడ్డి తెలిపారు.

కార్యకర్త కుటుంబానికి ఆర్థిక సాయం

బొమ్మనహాళ్, జనవరి 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని నేమకల్లు గ్రామానికి చెందిన జనసేన కార్యకర్త దాదాఖలందర్ ప్రమాదంలో మృతి చెందడంతో రాయదుర్గం, గుంతకల్లు జనసేన పార్టీ ఇన్‌చార్జులు మంజునాథ, వాసగిరి మణికంఠ బుధవారం సాయంత్రం రూ. 5 లక్షల ఆర్థిక సహాయం అందించారు. దాదాఖలందర్ జనసేనలో క్రియాశీలకంగా పనిచేస్తుండడంతో పార్టీ అధినేత పవన్‌కల్యాణ్ ఆ కుటుంబానికి అండగా ఉండాలని రూ. 5 లక్షలు చెక్కును జనసేన పార్టీ తరఫున పంపించినట్లు జనసేన ఇన్‌చార్జ్ మంజునాథ తెలిపారు. దీంతో వారి కుటుంబసభ్యులను కలిసి చెక్కును అందజేశారు. కార్యక్రమంలో నాయకులు శివరాజ్, రంజిత్, వంశి, శివరామ్, రవి, సికిందర్, ఖాదర్ పాల్గొన్నారు.

పరిశోధనలకు ప్రాధాన్యం

గుంతకల్లుటౌన్,జనవరి29(ఆంధ్రజ్యోతి): దేశం అభివృద్ధి పథంలోకి వెళ్లాలంటే పరిశోధనలకు ప్రాధాన్యం ఇవ్వాలని ఎస్కేయూనివర్శిటీ రెక్టార్ ప్రొఫెసర్ వెంకటనాయుడు పేర్కొన్నారు. పట్టణంలోని శంకరానందగిరి స్వామి డిగ్రీ కళాశాలలో బుధవారం విజన్ వికసిత్ భారత్‌పై సెమినార్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎస్కేయూనివర్శిటీ రెక్టార్ ప్రొఫెసర్ వెంకటనాయుడు, కళాశాల కరస్పాండెంట్ కేసీ హరికుమార్ హాజరయ్యారు.

ప్రకృతి వ్యవసాయం భేష్

కూడేరు, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని జల్లిపల్లిలో ప్రకృతి వ్యవసాయంతో సాగు చేసిన మామిడి తోటను శ్రీలంక ప్రతినిధుల బృందం పరిశీలించింది. బుధవారం సాయంత్ర సమయంలో ప్రకృతి వ్యవసాయ డీపీఎం లక్ష్మనాయక్ ఆధ్వర్యంలో బృందం వివిధ పంటలను పరిశీలించింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రతినిధులు భానుమతి, అనురాధ, మండలంలోని ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.



జల్లిపల్లి వద్ద మామిడి తోటను పరిశీలిస్తున్న శ్రీలంక సభ్యులు

కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోండి : విప్

రాయదుర్గంరూరల్, జనవరి 29(ఆంధ్రజ్యోతి): రైతాంగానికి మేలు చేయడానికి ఏర్పాటు చేసిన కందుల కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు పేర్కొన్నారు. బుధవారం పట్టణ సమీపంలోని 74 ఉడేగోళం సహకార సంఘం కార్యాలయంలో ఏపీ మార్క్‌ఫెడ్, నాఫెడ్ ఆధ్వర్యంలో కందుల కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొని కాలవ శ్రీనివాసులు కందుల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బహిరంగ మార్కెట్‌లో పంట ఉత్పత్తులకు గిట్టుబాటు ధర లభించని సమయంలో కనీస మద్దతు ధరపై కొనుగోలుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. దాని వల్ల బహిరంగ మార్కెట్‌లో పోటీ పెరిగిన రైతులకు ప్రయోజనం కలుగుతుందన్నారు. జిల్లా వ్యాప్తంగా 70 వేల మెట్రిక్ టన్నుల పంట చేతికి వచ్చిందన్నారు. రాయదుర్గం నియోజకవర్గంలో దాదాపు 5,600 మెట్రిక్ టన్నులు దిగుబడి వచ్చినట్లు అధికారులు అంచనా వేశారని తెలిపారు. చాలా మంది రైతులు పంట ఉత్పత్తిని కొనుగోలు కేంద్రానికి విక్రయించడానికి ముందుకు రాలేదన్నారు. కార్యక్రమంలో జిల్లా మార్క్‌ఫెడ్ మేనేజర్ వెన్నేశ్వరి, ఏడీఏ లక్ష్మానాయక్, ఏఓ మహేంద్ర, సీఈఓ కేసీ ఆంజనేయులు, మండల కన్వీనర్ హనుమంతు, సర్పంచులు వన్నూరుస్వామి, అశోక్, వన్నూరుస్వామిపాల్గొన్నారు.



కందుల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు

వేణుగోపాలస్వామి కల్యాణోత్సవానికి ఆహ్వానం

రాయదుర్గం పట్టణంలో వెలసి సంతాన వేణుగోపాలస్వామి కల్యాణోత్సవానికి ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులును ఆహ్వానించినట్లు యాదవ సంఘం అధ్యక్షుడు బంగి ఉమాశంకర్ తెలిపారు. బుధవారం ఎమ్మెల్యే నివాసంలో కలిసి ఫిబ్రవరి 2 నుండి 3వ తేదీల్లో జరుగు సంతాన వేణుగోపాలస్వామి 13వ వార్షికోత్సవ కళ్యాణోత్సవానికి ఆహ్వానం పలుకుతూ కరపత్రాలు ఆయనకు అందించారని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు రామస్వామి, ప్రధాన కార్యదర్శి లక్ష్మీనారాయణ, నాగరాజు, లోకేష్, మనోహర్ పాల్గొన్నారు.

బస్సు నుంచి పడి విద్యార్థి మృతి



విడపనకల్లు, జనవరి 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని డొనేకల్లు గ్రామానికి చెందిన విద్యార్థి హేమంత్(15) బుధవారం ప్రమాదవశాత్తు కింద పడి మృతి చెందాడు. గ్రామానికి చెందిన బసవరాజు నీలమ్మ దంపతుల కుమారుడు హేమంత్ గడేకల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నాడు. ప్రతీ రోజు డొనేకల్లు నుంచి గడేకల్లులోని పాఠశాలకు వచ్చేవాడు. బుధవారం సాయంత్రం పాఠశాల వదిలిన అనంతరం గడేకల్లు నుంచి డొనేకల్లుకు ఆర్టీసీ బస్సులో బయలు దేరాడు. డొనేకల్లు గ్రామం వద్దకు వెళ్లగానే బస్సులో నుంచి కిందికి దిగుతూ ప్రమాదవశాత్తు పడి తీవ్రంగా గాయపడినట్లు బంధువులు తెలిపారు. వెంటనే గుంతకల్లు ఆసుపత్రికి తీసుకెళ్లగా మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు విడపనకల్లు ఎస్ఐ ఖాజా హుస్సేన్ తెలిపారు.

మామిడి తోటకు నిప్పు



కాలిపోయిన మామిడి మొక్కలు

బ్రహ్మసముద్రం, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తిప్పయ్యదొడ్డి గ్రామ రైతు జయరామ్‌కు చెందిన నాలుగు ఎకరాల మామిడి తోటకు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టారు. మూడు నెలల క్రితం మామిడి మొక్కలు ఒక చెట్లు నాటి డ్రిప్పు పరికరాలను అమర్చారు. బుధవారం పొలంలో ఒక్కసారిగా మంటలు రావడంతో వెళ్లి చూడగా చెట్లు డ్రిప్ పరికరాలు, మామిడి మొక్కలు, చెట్లు కాలిపోయాయన్నారు. ప్రమాదవశాత్తు జరిగిందా ఉద్దేశ పూర్వకంగా నిప్పంటించారా అనేది రైతు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

మూడురోజులుగా విద్యుత్ సరఫరా బంద్

రాయదుర్గం రూరల్, జనవరి 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని పల్లేపల్లి సబ్ స్టేషన్ నుంచి మల్లాపురం, మెచ్చిరి, పల్లేపల్లి, కల్యం గ్రామాలకు గత మూడురోజులుగా విద్యుత్ సరఫరా అంతరాయం ఏర్పడింది. దీంతో రైతులు తమ పంటలను కాపాడుకోవడంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కనీసం తాగునీటికి కూడా విద్యుత్ సరఫరా చేయడం లేదని గ్రామస్థులు వాపోతున్నారు. మూడురోజుల క్రితం సిబ్బంది అనాలోచిత నిర్ణయం వల్ల బళ్లారిరోడ్డు నందు ముఖద్వారం వద్ద రైల్వేలైన్ కింద భాగాన ఏర్పాటు చేసిన కేబుల్ కిట్టు పాడైపోవడంతో ఈ ఇబ్బందులు ఏర్పడినట్లు ఏఈ బాలచంద్ర తెలిపారు. దాన్ని మరమ్మతులు చేయడానికి గత మూడురోజుల నుంచి సిబ్బంది పనిచేస్తున్నా సాధ్యం కాలేదని అన్నారు. తరచూ మూడునెలలకోసారి ఈ సమస్య ఏర్పడుతుందని చేయడానికి కనీసం మూడురోజుల సమయం తీసుకుంటున్నట్లు సిబ్బంది తెలిపారు.

నిధుల దుర్వినియోగంపై చర్యలు తీసుకోండి

యాడికి, జనవరి 29(ఆంధ్రజ్యోతి): డ్వాక్రా సంఘాల మహిళల నిధులను దుర్వినియోగం చేసిన వారిపై తగు చర్యలు చేపట్టి తమకు న్యాయం చేయాలని బుధవారం తూట్రాళ్లపల్లికి చెందిన డ్వాక్రా సంఘాల మహిళలు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తూట్రాళ్లపల్లిలోని లక్ష్మీ మహిళా సంఘం, లలితా మహిళా సంఘం, సరస్వతి మహిళా సంఘాల్లోని 15మంది సభ్యులకు 2015-2016 ఆర్థిక సంవత్సరంలో ఉన్నతి ఎస్సీ సబ్‌ప్లాన్ కింద రూ.4.49 లక్షల రుణం మంజూరైందని తెలిపారు. ఈ రుణాన్ని సంఘాల్లోని మహిళలకు ఇవ్వకుండా అప్పట్లో వెలుగులో పనిచేసిన యానిమేటర్, సీసీలు దుర్వినియోగం చేశారని తెలిపారు. సంవత్సరాలు గడుస్తున్నా నిధులు దుర్వినియోగం చేసిన వారిపైన ఎలాంటి చర్యలు చేపట్టలేదని తెలిపారు. దుర్వినియోగం అయిన నిధులను రికవరీ చేయలేదన్నారు. నిధులు దుర్వినియో గం చేసిన వారిపై ఫిర్యాదు చేయడానికి పోలీస్‌స్టేషన్‌కు వచ్చినట్లు వారు తెలిపారు.

పట్టపగలే చోరీ

యాడికి, జనవరి29(ఆంధ్రజ్యోతి): యాడికిలోని శాంతినగర్‌లోని ఒక ఇంటిలో పగలే దొంగలు పడి రూ.15వేలు నగదు, తులం బంగారు కమ్మలు ఎత్తుకెళ్లిన సంఘటన బుధవారం జరిగింది. బాధితుడు గంధం పుల్లయ్య తెలిపిన వివరాలమేరకు.. వ్యక్తిగత పనుల నిమిత్తం ఇంటికి తాళం వేసి బయటకు వెళ్లినట్లు తెలిపాడు. 11:30 గంటల సమయంలో ఇంటికి వచ్చి తాళం తెరచి చూడగా ఇంటిలో లోపల ఉన్న బీరువా తలుపులు దొంగలు పగలగొట్టినట్లు గమనించానని తెలిపారు. బీరువాలో ఉన్న ఒక తులం బంగారు కమ్మలు, మరొక గదిలో పరుపుకింద పెట్టిన రూ.15వేల నగదు ఎత్తుకెళ్లినట్లు తెలిపాడు.

ఎఫ్ఏ పరీక్షలకు జవాబు పత్రాల కొరత

శెట్టూరు, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాల విద్యార్థులకు ఫార్మేటివ్ అసెస్మెంట్ ఎఫ్ఏ పరీక్షలు నిర్వహిస్తున్నారు. ప్రిన్సిపాల్ విద్యార్థులకు జవాబుపత్రాలు ఇవ్వకపోవడంతో వారు ఇబ్బంది పడ్డారు. విద్యార్థులను నోట్ పుస్తకాల్లో చించుకుని పరీక్షలు రాయాలని తెలపారు. జవాబు పత్రాలు లేకపోవడంతో విద్యార్థులు దిక్కుతోచక తమ త మ నోట్ పుస్తకాలు చించుకొని పరీక్షలు రాయాల్సిన దుస్థితి నెలకొన్నదని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయంపై ప్రిన్సిపాల్ గాయత్రిని వివరణ కోరగా.. సమ్మేటివ్ అసెస్మెంట్ పరీక్షలకు మాత్రమే జవాబు పత్రాలకు అందజేస్తామని, మిగిలిన పరీక్షలకు విద్యార్థులే తెచ్చుకోవాలన్నారు.

'ఆర్గానిక్ మందులతో మోసపోయాం'

ఉరవకొండ, జనవరి 29(ఆంధ్రజ్యోతి): నాసిరకం ఆర్గానిక్ మందులు వాడి 15ఎకరాల్లో సాగుచేసిన మిర్చి పంటను కోల్పోయామని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. మండల పరిధిలోని వ్యాసాపురం గ్రామంలో మనోహర్, ఎల్లప్ప నాగరాజు గత ఏడాది ఆగస్టులో 15ఎకరాల్లో మిర్చి పంటను సాగు చేశారు. ఎకరానికి రూ.లక్షదాకా పెట్టుబడి పెట్టి విత్తనం వేసినట్లు తెలిపారు. ఉరవకొండకు చెందిన ఏజెన్సీ వారు తమ వద్ద ఆర్గానిక్ మందులు అందుబాటులో ఉన్నాయని వాటిని వాడితే ఎకరాకు 30క్వింటాళ్ల దాకా దిగుబడి వస్తుందని తెలిపారు. దీంతో రైతులు వారి మాటలు నమ్మి ఆర్గానిక్ మందులు వాడారు. ఆ మందులు పిచికారి చేయడంతో పంట ఎదుగుదల లేక కుళ్లిపోయి, తీవ్రంగా నష్టపోయారు.

నీటి సమస్యలపై ఫోన్ చేయండి

ఉరవకొండ, జనవరి 29(ఆంధ్రజ్యోతి): ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు నీటి సమస్య పరిష్కారానికి ఫోన్ ఇన్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. పట్టణంలో ఎక్కడైనా తాగునీటి సమస్య, పైప్‌లైన్ లీకేజీ ఉంటే, ఫోన్ చేసి సమాచారమందిస్తే చర్యలు తీసుకుంటామని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఐజయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 9491120803, 9866826367, 9989804255 నెంబర్లకు ఫోన్ చేయవచ్చునన్నారు.

ఇద్దరి అరెస్ట్

తాడిపత్రి, జనవరి29(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గణేష్‌నగర్‌కు చెందిన సుభద్రమ్మపై దాడికేసుకు సంబంధించిన బుధవారం కుళ్లాయప్ప, వెంకటరమణలను అరెస్ట్‌చేశామని పట్టణ పోలీసులు తెలిపారు. వారు తెలిపిన వివరాలమేరకు డిసెంబరు 31న గణేష్‌నగర్‌కు చెందిన సుభద్రమ్మపై మద్యం మత్తులో ఇరువురు దాడిచేసి గాయపరిచారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసునమోదుచేసి బుధవారం ఇరువురిని అరెస్ట్‌చేసి రిమాండ్‌కు పంపినట్లు పోలీసులు తెలిపారు.

గడ్డివామి దగ్ధం

బ్రహ్మసముద్రం, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని భైరసముద్రం గ్రామానికి చెందిన సూరయ్య గారి వీరస్వామికి చెందిన గడ్డివాము నందు మూడు ట్రాక్టర్ల వేరుశనగ గడ్డి, వరి గడ్డి ప్రమాదవశాత్తు నిప్పు అంటుకొని కాలిపోయింది. గమనించిన గ్రామస్తులు నీటితో మంటల ను ఆర్పారు. రూ. 40 వేలు పశువుల మేత కాలిపోయిందని రైతు ఆవేదన వ్యక్తం చేశారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

పెద్దపప్పూరు, జనవరి29(ఆంధ్రజ్యోతి): మండలంలోని షేక్‌పల్లి శివారులోని అరటితోటలో నిర్వహిస్తున్న పేకాటస్థావరంపై బుధవారం దాడిచేసినట్లు ఎస్ఐ నాగేంద్రప్రసాద్ తెలిపారు. సమాచారం మేరకు సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించామని తెలిపారు. ఈ దాడుల్లో రూ.51500 నగదు, నాలుగు ద్విచక్రవాహనాలను సీజ్‌చేశామని తెలిపారు.